

టిప్పర్ బీభత్సం

- విజయ రామరాజుపేట రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద సేఫ్టీ గడ్డర్‌ను ఢీకొన్న వాహనం
- సుమారు అడుగు మేర పక్కకు జరిగిన రైల్వే ట్రాక్
- అదే సమయంలో గూడ్స్ రైలు రాక
- ఎమర్జెన్సీ బ్రేకులు వేసి, రైలును నిలిపివేసిన లోకో పైలట్
- ఒక లైన్‌పై రైళ్ల రాకపోకలకు అంతరాయం
- యుద్ధ ప్రాతిపదికన ట్రాక్ పునర్నిర్మాణం
- గంటల తరబడి ఆలస్యంగా నడిచిన రైళ్లు
- తీవ్ర ఇబ్బందిపడిన ప్రయాణికులు
- తప్పిన పెను ప్రమాదం



వంతెనపై నిలిచిన గూడ్స్ రైలు ఇంజను, టిప్పర్ ఢీకొనడంతో విరిగిన గడ్డర్



ట్రాక్ పునరుద్ధరణ పనుల్లో రైల్వే అధికారులు, సిబ్బంది

అనకాపల్లి టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సోమవారం తెల్లవారుజామున బండరాళ్ల లోడుతో వెళుతున్న టిప్పర్ లారీ బీభత్సం సృష్టించింది. సేఫ్టీ గడ్డర్‌ను బలంగా ఢీకొనడంతో అది విరిగిపోయి రైల్వే ట్రాక్‌కు తగిలింది. దీంతో సుమారు అడుగు మేర ట్రాక్ పక్కకు జరిగింది. ఆ సమయంలో వస్తున్న గూడ్స్ రైలు లోకో పైలట్ గమనించి, ఎమర్జెన్సీ బ్రేకులు వేసి రైలును నిలుపుదల చేశారు. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్ మరమ్మతు పనులు చేపట్టారు. సుమారు నాలుగు గంటలపాటు శ్రమించి ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సంఘటన కారణంగా విజయవాడ వైపు నుంచి విశాఖ వెళ్లే పలురైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడిచాయి. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.



సేఫ్టీ గడ్డర్‌ను ఢీకొన్న టిప్పర్ లారీ ఇదే



రైల్వే ట్రాక్ కింద దెబ్బతిన్న ఐరన్ ప్లేట్లు

అనకాపల్లి మండలం మార్టూరు నుంచి సోమవారం తెల్లవారుజామున బండరాళ్ల లోడుతో టిప్పర్ లారీ రాంబిల్లి మండలంలోని ఎన్ఏవోబీకి బయలుదేరింది. నాలుగున్నర గంటల సమయానికి అనకాపల్లి పట్టణంలోని విజయరామరాజుపేట రైల్వే అండర్‌బ్రిడ్జి వద్దకు చేరింది. అధిక లోడుతో వాహనాలు ... మిగతా 8వ పేజీలో

ఆలస్యంగా రైళ్లు..

ఇబ్బంది పడిన ప్రయాణికులు

విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద ప్రమాదం జరిగిన కారణంగా విజయవాడ వైపు నుంచి అనకాపల్లి మీదుగా విశాఖ వైపు వెళ్లే పలు రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడిచాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెల్లవారుజామున 4.20 గంటలకు అనకాపల్లి రావాల్సిన గోదావరి ఎక్స్‌ప్రెస్ ఉదయం 8.00 గంటలకు చేరుకుంది. సికింద్రాబాద్-భువనేశ్వర్...విశాఖ ఎక్స్‌ప్రెస్ 4.30 గంటలకు బదులు 8.30 గంటలకు వచ్చింది. 5.50 గంటలకు రావాల్సిన గరీబ్‌రథ్ 9.30 గంటలకు, 5.20 గంటలకు రావాల్సిన చెన్నై-హౌరా మెయిల్ 10.20 గంటలకు, 7.10 గంటలకు రావాల్సిన గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ 10.30 గంటలకు, 7.20 గంటలకు రావాల్సిన కాకినాడ-విశాఖపట్నం రైలు 11.50 గంటలకు వచ్చాయి. ఇంకా 9.30 గంటలకు రావాల్సిన తిరుమల ఎక్స్‌ప్రెస్ 12.15 గంటలకు, 9.20 గంటలకు రావాల్సిన బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 12 గంటలకు, ఉదయం పదిన్నరకు రావాల్సిన విజయవాడ-విశాఖ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ 12.30 గంటలకు వచ్చాయి. అదేవిధంగా విశాఖ వైపు నుంచి విజయవాడ వైపు వెళ్లే రైళ్లు కూడా ఆలస్యంగా నడిచాయి. ఉదయం ఏడు గంటలకు విశాఖ నుంచి అనకాపల్లి రావాల్సిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్ 9.15 గంటలకు, 7.50 గంటలకు రావాల్సిన విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ 9.50 గంటలకు వచ్చాయి. ఇదిలావుండగా విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద టిప్పర్ లారీ ఢీకొనడంతో విరిగిన సేఫ్టీ గడ్డర్‌ను రైల్వే సిబ్బంది సోమవారం సాయంత్రానికి పునరుద్ధరించారు.

రియల్టర్ల దందా

మునగపాకలో సాగునీటి కాలువ ఆక్రమణ

వెంచర్‌లోకి వెళ్లడానికి సిమెంట్ తూములతో రోడ్డు

- పంట కాలువ పూడ్చివేత
- చోద్యం చూస్తున్న ఇరిగేషన్ అధికారులు
- పంచాయతీ, వీఎంఆర్‌డీఏ అనుమతులు లేకుండా వెంచర్లు



మునగపాక మండలంలో పంట కాలువను పూడ్చేసి వెంచర్‌లోకి వేసిన రోడ్డు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ భూములు, సాగునీటి కాలువలను పరిరక్షించాల్సిన సంబంధిత శాఖల అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తున్న కొంతమంది రియల్టర్లు.. కొండలు, వాగులు, వంకలు, పంట కాలువలను అడ్డగోలుగా ఆక్రమిస్తున్నారు. ఇటువంటివి దాదాపు అన్ని మండలాల్లో జరగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఒకరిని చూసి మరొకరు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు. ఇదే తరహాలో మునగపాక మండలంలో వందలాది ఎకరాలకు సాగునీరు అందించే ముళ్లబంద కాలువను రియల్టర్లు ఆక్రమించారు.

మునగపాక మండలం ఉమ్మలాడ వద్ద శారదా నదిపై నిర్మించిన గొడారి ఆనకట్ట నుంచి కృష్ణరాజు ప్రధాన కాలువ వరకు మునగపాక ప్రధాన రోడ్డుకు సమీపంలో సుమారు మూడు కిలోమీటర్ల పొడవున ముళ్లబంద కాలువ ప్రవహిస్తోంది. కాలువకు అవతలి వైపు కొంతమంది రియల్టర్లు ఇటీవల పంట పొలాలను కొనుగోలు చేసి భారీ వెంచర్లు వేస్తున్నారు. కానీ 'నాలా' చెల్లించకుండా, పంచాయతీతో పాటు వీఎంఆర్‌డీఏ అనుమతులు తీసుకోలేదు. ఒక వెంచర్ వేసిన రియల్టర్.. పంట కాలువను కప్పేసి, తూములతో దర్జాగా రోడ్డు వేశారు. మరో రెండు రియల్ ఎస్టేట్ సంస్థలు పొలాలను మెరక చేసి వెంచర్‌కు రోడ్లు వేస్తున్నారు. ఇది జరిగి చాలా రోజులు అయినప్పటికీ ఇంతవరకు ఇరిగేషన్ అధికారులు అటువైపు కన్నెత్తి అయినా చూడలేదు. ముళ్లబంద కాలువను కప్పేయడంతో తమ పొలాలకు నీరు అందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి ముళ్లబంద కాలువను కప్పేసి, అడ్డంగా తూములు వేసిన రియల్టర్లపై చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



వీఎంఆర్‌డీఏ లేఅవుట్ అంటూ ప్రైవేటు వెంచర్‌కు ఏర్పాటు చేసిన బోర్డు

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

- తొలి రోజు 21,162 మందికిగాను 20,967 మంది విద్యార్థులు హాజరు



అనకాపల్లిలోని ఒక పరీక్షా కేంద్రంలో కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 107 పరీక్ష కేంద్రాల్లో తొలి రోజు నిర్వహించిన తెలుగు పరీక్షకు 21,162 మందికిగాను 20,967 మంది విద్యార్థులు హాజరయ్యారు. కలెక్టర్ విజయకృష్ణన్ అనకాపల్లిలోని భాష్యం స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పించిన సదుపాయాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రస్థాయి పరిశీలకులు పి.శ్రీనివాస్, డీఈవో గిడ్డి అప్పారావునాయుడు సంయుక్తంగా ఐదు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. ఏడు స్క్వాడ్ బృందాలు 44 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయి. ఎక్కడా అక్రమాలు, అవకతవకలు జరగలేదని డీఈఓ తెలిపారు.



దివ్యాంగురాలైన ఈ విద్యార్థిని పేరు పెంటకోట శాంతి. సుమారు 15 కిలోమీటర్ల దూరంలోని బి.కింతాడ నుంచి తల్లి ఆటోలో ఎక్కించుకుని దేవరాపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి తీసుకువచ్చింది. ఆటో డ్రైవర్ సహాయంతో పరీక్ష హాలులోకి తీసుకెళ్లింది. పరీక్ష ముగిసిన తరువాత మళ్లీ ఆటోలోనే ఇంటికి తీసుకెళ్లింది. బి.కింతాడ- దేవరాపల్లి మార్గంలో ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తున్నదని శాంతి తల్లితోపాటు పలువురు విద్యార్థులు వాపోయారు.

-దేవరాపల్లి/ ఆంధ్రజ్యోతి

ఒడిదుడుకుల్లో గోవాడ

చెరకు క్రషింగ్‌కు తరచూ అంతరాయాలు

- ఏడు వారాల్లో తొమ్మిదిసార్లు ఆగిన క్రషింగ్
- ఓవర్ హాలింగ్ పనులు సరిగా చేయకపోవడమే కారణం
- వేధిస్తున్న నైపుణ్య కార్మికుల కొరత
- చెరకు రైతుల్లో పెరుగుతున్న అసహనం

యార్డులో వేచిఉన్న చెరకు బండ్లు



చోడవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో చెరకు క్రషింగ్ మూడు అడుగులు ముందుకి.. ఆరు అడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది. ఈ ఏడాది దాదాపు రెండు నెలలు ఆలస్యంగా క్రషింగ్ మొదలుకాగా, ఇంతవరకు తొమ్మిదిసార్లు అంతరాయం ఏర్పడింది. దీనివల్ల ఫ్యాక్టరీకే కాకుండా రైతులకు కూడా తీవ్రనష్టం వాటిల్లుతున్నది. ఫ్యాక్టరీలో క్రషింగ్ పరిస్థితిని చూసి వచ్చే సీజన్‌లో చెరకు సాగు చేయాలా? వద్దా? అన్న సందిగ్ధంలో పడ్డారు.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో ఏటా నవంబరు చివరి వారంలో లేదా డిసెంబరు తొలివారంలో చెరకు క్రషింగ్ ప్రారంభం అవుతుంది. కానీ గత ఏడాది డిసెంబరులో కూడా వర్షాలు పడడం వల్ల ఫ్యాక్టరీకి చెరకు తరలింపులో రైతులు ఇబ్బంది పడతారన్న ఉద్దేశంతో జనవరి నుంచి క్రషింగ్ చేయాలని యాజమాన్యం భావించింది. జనవరి మొదటి వారంలో క్రషింగ్ ప్రారంభిస్తే.. సంక్రాంతి పండుగ సమయంలో రైతులు చెరకు సరఫరా చేయకపోతే క్రషింగ్‌కు అంతరాయం ఏర్పడుతుందని భావించి చివరకు జనవరి 21న రెగ్యులర్ క్రషింగ్‌ను ప్రారంభించారు. ఆదిలోనే హంస పాదు అన్నట్టు.. మరుసటి రోజే సాంకేతిక సమస్యతో క్రషింగ్ నిలిచిపోయింది. ఒక రోజు తరువాత క్రషింగ్‌ను పునరుద్ధరించగా.. మళ్లీ మూడు రోజులకే.. జనవరి 26న బాయిలర్‌లో సమస్య తలెత్తడంతో మరోసారి క్రషింగ్ నిలిచిపోయింది. సమస్యను సరిదిద్ది క్రషింగ్ ప్రారంభమైందనుకునేసరికి, ఫ్యాక్టరీ రన్నింగ్‌కు అవసరమైన బగాస్ నిల్వలు అయిపోవడంతో మరుసటి రోజే క్రషింగ్ ఆగిపోయింది. చెరకు బండ్లు, ట్రాక్టర్లతో యార్డు మొత్తం నిండిపోయి ప్రధాన రహదారిపై వరకు చేరాయి. సిబ్బంది సమస్యను సరిదిద్ది 29న క్రషింగ్ ప్రారంభించారు. కొంతసేపటికే బగాస్ క్యారేజీ చెయిన్ తెగిపోయింది. దీనిని సరిదిద్ది క్రషింగ్‌ను పునరుద్ధరించడగా.. మరోసారి బగాస్ నిల్వలు చాలక.. ఫిబ్రవరి 4న క్రషింగ్ ఆగిపోయింది. బగాస్ రప్పించి 6న క్రషింగ్‌ను పునరుద్ధరించారు. 25వ తేదీ వరకు క్రషింగ్ బాగానే జరిగింది. పరిస్థితి మెరుగుపడిందనుకున్న సమయంలో ఫిబ్రవరి 26న మళ్లీ ఆగింది. దీంతో రైతులు ఆందోళనకు దిగి, చెరకు బండ్లను రోడ్డుకు అడ్డంగా పెట్టి ఆందోళనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జోక్యం చేసుకుని చక్కదిద్దారు. రెండు రోజుల తరువాత తిరిగి క్రషింగ్ ప్రారంభించారు. ఈ నెల 5న టర్బయిన్‌లో సమస్య ... మిగతా 8వ పేజీలో



జనసంచారం అంతంతమాత్రంగానే వున్న నర్సీపట్నం మెయిన్ రోడ్డు

భానుడి భగభగ

- రావికమతంలో 42.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

అనకాపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వాతావరణం మండు వేసవిని తలపిస్తున్నది. మార్చి మూడో వారంలోనే భానుడు ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. సోమవారం గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీల వరకు అధికంగా నమోదయ్యాయి. ఉదయం పది గంటల నుంచే ఎండ ఠారెత్తించింది. మధ్యాహ్న సమయంలో వడగాడ్పులు వీచాయి. రావికమతం మండలంలో అత్యధికంగా 42.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నర్సీపట్నంలో 41.1 డిగ్రీలు, నాతవరంలో 41.3, రోలుగుంట ... మిగతా 8వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.11 (మంగళవారం సాయంత్రం)
సహర్ : 4.49 (బుధవారం ఉదయం)

చెట్లకు క్యూఆర్ కోడ్

- నర్సీపట్నం డిగ్రీ కళాశాల లెక్చరర్ వినూత్న ప్రయోగం



డిగ్రీ కళాశాలలో చెట్టుకు వేలాడదీసిన క్యూఆర్ కోడ్

నర్సీపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చెట్లుకి క్యూఆర్ కోడ్లు అమర్చారు. వృక్షశాస్త్రం చదువుతున్న విద్యార్థుల కోసం అధ్యాపకుడు అఖిల్‌రాజా వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. తరగతి గదిలో అధ్యాపకులు చెప్పిన పాఠ్యాంశాలు మరింత సులభతరంగా విద్యార్థులు అర్థం కోవడానికి చెట్లకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. బెస్ట్ ప్రాక్టీసెస్‌లో భాగంగా చెట్ల పేర్లు, ఉపయోగాలు తెలుసు కోవడానికి కళాశాల ఆవరణలో ఉన్న పది చెట్లకు క్యూఆర్ కోడ్ బోర్డులు తగించారు. స్మార్ట్ ఫోన్‌తో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే... చెట్టు శాస్త్రీయ నామం, సాధారణ పేరు, ఉపయోగాలు కనిపిస్తాయి. ఉదాహరణకు నిమ్మ చెట్టుకి వుంచిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే శాస్త్రీయ నామం- సిట్రస్ లెమన్‌ని, సాధారణ ... మిగతా 8వ పేజీలో



చెట్టుకి అమర్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తున్న విద్యార్థి

చినగుమ్ములూరు వద్ద బస్సు బోల్తా

- రొయ్యల కంపెనీకి కార్మికులను తీసుకువస్తుండగా ప్రమాదం
- 13 మందికి తీవ్రగాయాలు
- నక్కపల్లిలో ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి తరలింపు
- ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో ఊరట



బోల్తా పడిన బస్సు



అనకాపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎస్.మహాలక్ష్మి, ఎస్.వరలక్ష్మి

ఎస్.రాయవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినగుమ్ములూరు సమీపంలో సోమవారం ఉదయం రొయ్యల పరిశ్రమలకు కార్మికులను తీసుకువస్తున్న బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 13 మందికి తీవ్రగాయాలు కాగా, మరో 19 మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను తొలుత నక్కపల్లి సీహెచ్‌సీకి తరలించారు. తీవ్రంగా గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేసిన అనంతరం అనకాపల్లిలో ప్రైవేటు ఆస్పత్రికి పంపారు. ఈ సంఘటనకు సంబంధించి క్షతగాత్రులు, పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

ఎస్.రాయవరం మండలం ధర్మవరం అగ్రహారంలో కోస్టల్ కార్పొరేషన్ రొయ్యల పరిశ్రమలో పలు గ్రామాలకు చెందిన కార్మికులు పనిచేస్తున్నారు. సోమవారం మొదటి షిఫ్ట్‌లో పనిచేసే కోటవురట్ల మండలం లింగాపురం, పందూరు, గొల్లపేట, కైలాసపట్నం, ఎస్.రాయవరం మండలం చినగుమ్ములూరు, పెదగుమ్ములూరు గ్రామాలకు చెందిన 34 మంది కార్మికులు బస్సులో కంపెనీకి బయలుదేరారు. ఉదయం 5.30 గంటల సమయంలో చినగుమ్ములూరు దాటిన తరువాత పొగ మంచు అధికంగా వుండడంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన వున్న పొలంలోకి ... మిగతా 8వ పేజీలో

ఆశీలు ఆదాయం పెరిగేనా..?



పాయకరావుపేట పంచాయతీ కార్యాలయం

నాలుగేళ్లుగా పాయకరావుపేట పంచాయతీ వేలం పాట తగ్గుముఖం?

అప్‌సెట్ ప్రైస్‌కి దగ్గరగా ఖరారు..

పాయకరావుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వ్యాపార రంగంలో దినదినాభివృద్ధి చెందుతున్న పాయకరావుపేట మేజర్ పంచాయతీలో గత నాలుగేళ్లుగా తగ్గుతున్న పంచాయతీ ఆదాయం ఈ ఏడాదైనా పెరుగుతుందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీలో రోజువారీ ఆశీలు, మేకల కబేళా, రిటైల్ చేపల మార్కెట్ తదితర వాటికి గత నాలుగేళ్లలో నిర్వహించిన వేలం పాటల్లో అధికారుల ఎదుటే పాటదారులు రింగవడం, అప్‌సెట్ ప్రైస్ ముందుగానే లీకవడంతో వేలం పాటల్లో పంచాయతీ ఆదాయం గణనీయంగా పడిపోయిందని ఆరోపణలు ఉన్నాయి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రోజువారీ మార్కెట్ ఆశీల వేలం పాట రూ.7.1 లక్షలకు వెళ్లగా.. 2022-23లో అంతకుముందు ఏడాది కంటే రూ.80 వేలు తగ్గి రూ.6.3 లక్షలకు, 2023-24లో రూ.6.5 లక్షలు, 2024-25లో రూ.6.65 లక్షలకు అంటే అప్‌సెట్ ప్రైస్‌కి దగ్గరగా పాటలు ఖరారవడం ఇందుకు నిదర్శనం.

గడచిన నాలుగేళ్లలో పట్టణంలో 30 వేలకు పైగా జనాభా పెరిగింది. పదుల సంఖ్యలో పెద్ద షాపింగ్ మాల్స్, వ్యాపార సంస్థలు నెలకొల్పారు. అలాగే రెండు కిలోమీటర్లున్న మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా వందల సంఖ్యలో చిరు వ్యాపారాలు, చిన్న దుకాణాలు ఏర్పాటయ్యాయి. అయినా 2021 నుంచి 2025 మధ్యలో పంచాయతీ ఆదాయం మాత్రం తగ్గింది. రోజువారీ మార్కెట్ ఆశీల వసూలు ద్వారా వచ్చిన ఆదాయం 2021లో రూ.7.1 లక్షలు ఉంటే తక్కువగా 2024లోరూ.6.65 లక్షలకు పడిపోయింది. దీనిని అనుసరించి గడచిన నాలుగేళ్లలో పంచాయతీ అధికారుల పనితీరు ఏవిధంగా ఉందో ఇట్టే చెప్పవచ్చు. పంచాయతీలోని అన్నింటికి ఈనెలలో వేలం పాటలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు. ఇదిలా ఉంటే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈనెలలో పంచాయతీ వేలం పాలు నిర్వహించనున్నందున ఇప్పటికైనా ఉన్నతాధికారులు పంచాయతీ ఆదాయంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని పట్టణప్రజలు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చలపతిరావు

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

- మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు

అచ్యుతాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతి రావు అన్నారు. సోమవారం ఇక్కడ జరిగిన ఎలమంచిలి మండలం, టౌన్ టీడీపీ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి మరింత కృషిచేయాలన్నారు. రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా అండగా ఉంటామన్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న నియోజకవర్గంపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. అంతకుముందు పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు చేతుల మీదుగా పార్టీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ భాస్కర్, నియోజకవర్గ పరిశీలకులు బొండి జగన్నాథం, కొలుకులూరి విజయరామరాజు, రాజాన సూర్య నాగేశ్వరరావు, కాండ్రకోట చిరంజీవి, ఇత్తంశెట్టి రాజు, ఆడారి ఆదిమూర్తి, కొటారు సాంబ, జి. నాగేశ్వరరావు, ఎం.రామకృష్ణ, నమ్మి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఏటికొప్పాకలో పారిశుధ్య పనులు

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఏటికొప్పాక డ్రైనేజీల్లో చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

ఎలమంచిలి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ ఏటికొప్పాకలో సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈనెల 15వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో 'ఏటికొప్పాక..సమస్యల కుప్ప' శీర్షికతో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. గ్రామంలోని అన్ని డ్రైనేజీల్లో చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే పనులు చేపట్టారు. కాలువలను శుభ్రం చేసి బ్లీచింగ్, ఫినాయిలను పిచికారీ చేశారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం



పాయకరావుపేట జడ్పీ హైస్కూల్ వద్ద తల్లిదండ్రులతో కలిసి ఉన్న విద్యార్థులు



ఎలమంచిలిలో రూమ్ నంబర్లు పరిశీలించుకుంటున్న విద్యార్థినులు

పాయకరావుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు నిర్వహించిన తెలుగు పరీక్షకు 1,256 మంది హాజరుకావాల్సి ఉండగా 1,243 మంది హాజరయ్యారని ఎంఈఓ కేఎన్.గాంధీ తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సీఐ జి.అప్పన్న ఆధ్వర్యంలో పోలీసులు డ్రోన్లతో నిఘా పెట్టారు.

అచ్యుతాపురంలో..

అచ్యుతాపురంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నాలుగు కేంద్రాల్లో 810 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాంబిల్లిలో..

పదో తరగతి పరీక్షలు సోమవారం మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు సోమవారం 626 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 620 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈవోలు సూర్యారావు, సూర్యనారాయణ తెలిపారు.

ఎలమంచిలిలో..

ఎలమంచిలి పట్టణంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నాలుగు పరీక్షా కేంద్రాల్లో 875 మంది విద్యార్థులకు గాను 870 మంది పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా కొత్తపేట, తులసీనగర్ బాలికోన్నత పాఠశాల పరీక్షా కేంద్రాలను డిప్యూటీ డీఈవో అప్పారావు తనిఖీ చేశారు.

మునగపాకలో..

మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు మొదలయ్యాయి. ఎటువంటి మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో వేణుగోపాలరావు చెప్పారు. తొలిరోజు నాలుగు కేంద్రాల్లో 634 మంది విద్యార్థులు తెలుగు పేపర్ రాశారని తెలిపారు.

నక్కపల్లిలో..

మండలంలోని వేంపాడు, గొడిచెర్ల, నక్కపల్లిలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఐదు కేంద్రాల్లో 938 మంది విద్యార్థులు పరీక్షలు రాయల్సివుండగా, 932 మంది పిల్లలు హాజరైనట్టు చెప్పారు. ఆరుగురు విద్యార్థులు హాజరుకాలేదని చెప్పారు.

ఎస్.రాయవరంలో..

మండలంలో ఐదు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అడ్డరోడ్డు, కొరుప్రోలు, ధర్మవరం అగ్రహారం, దార్లపూడి,ఎస్.రాయవరం పరీక్షా కేంద్రాలకు విద్యార్థులందరూ సమయానికి హాజరయ్యారు.

కోటవురట్లలో..

పదో తరగతి పరీక్షల్లో తొలిరోజు సోమవారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో 276 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా నలుగురు గైర్హాజరయ్యారు. అలాగే బాలికల ఉన్నతపాఠశాలల్లో 152 మంది హాజరు కావలసి ఉండగా.. ఇద్దరు విద్యార్థులు పరీక్షలకు హాజరుకాలేదు. పాములవాక జడ్పీ హైస్కూల్‌కు చెందిన 78 విద్యార్థులు నర్సీపట్నం మండలం వేములపూడి జడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్‌ల్లో పరీక్షలు రాశారు.



నక్కపల్లి గురుకులం వద్ద పరీక్ష రాసేందుకు వచ్చిన టెన్త్ విద్యార్థులు



అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

దిబ్బపాలెంలో అవకతవకలపై కలెక్టర్‌కి ఫిర్యాదు



జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న దేముడు

అచ్యుతాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దిబ్బపాలెం (సెజ్ పునరావాస కాలనీ)లో జరిగే అవకతవకలపై విచారణ జరిపించాలని తెలుగుదేశం నాయకుడు అడిగర్ల దేముడు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో గల చేపల చెరువు పాట ద్వారా పంచాయతీకి వచ్చే ఆదాయానికి గండి కొట్లారని ఆరోపించారు. మోటూరు పాలెం యూపీ పాఠశాల నిర్మాణ పనులకు ఆరేళ్ల క్రితం బిల్లులు తీసుకున్నారని, ఇప్పుడు మరల పంచాయతీ తీర్మానం చేసి రూ. ఐదు లక్షలు కాజేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే కళ్యాణ మండపం ప్రాంగణంలో పంచాయతీ తీర్మానం లేకుండా చెట్లు నరికిన విక్రయించేశారన్నారు. వీటిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆయన పిర్యాదులో పేర్కొన్నారు.

ఘనంగా ముగిసిన వెంకన్న కల్యాణోత్సవాలు

- గణనీయంగా పెరిగిన ఆదాయం
- హుండీల ఆదాయం రూ. 29.57 లక్షలు



ఊయలలో కల్యాణ వేంకటేశ్వరుడి పవళింపు

నక్కపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు సోమవారం రాత్రి పుష్పయాగోత్సవాలతో ముగిశాయి. ఆలయ రాతి కల్యాణ మండపంలో పలు రకాల పుష్పమాలలతో స్వామివారి ఊయలను శోభాయమానంగా అలంకరించారు. ఉభయదేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవమూర్తులను ఊయలలో అలంకరించి పవళింపు సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. అనేక మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుని పులకరించారు. స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, సాయి గోపాలాచార్యులు, రాజగోపాలాచార్యులు, పవన్‌కుమార్ తదితరులు ప్రత్యేక పూజలు, నివేదనలు, హారతులిచ్చారు.

రికార్డు స్థాయిలో ఆదాయం

గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి ఉపమాక వెంకన్న ఆదాయం గణనీయంగా పెరిగింది. మూడున్నర దశాబ్దాల కాలంలో ఎప్పుడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. సోమవారం టీటీడీ అధికారుల పర్యవేక్షణలో పరఖామణి జరిగింది. భక్తులు హుండీల ద్వారా రూ.29,57,600 లక్షల ఆదాయం లభించిందని టీటీడీ ఏఈవో ఎం.జగన్మోహన్ ఆచార్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు చెప్పారు. ఇవి గాక లడ్డూ ప్రసాదాల ద్వారా మరో రూ. 5 లక్షలు ఆదాయం సమకూరినట్టు తెలిపారు.

'వంద రోజులు పని కల్పించాలి'



తిమ్మరాజుపేట సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామ ఉపాధి కూలీలు

అచ్యుతాపురం రూరల్, మార్చి 17, (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉపాధి కూలీకి వంద రోజులు పని కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. తిమ్మరాజుపేట సచివాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించిన ఉపాధి హామీ కూలీల ఆందోళనలో ఆయన మాట్లాడారు. పేదలకు పనులు కల్పించి వలసలు అరికట్టాలన్నారు. పనులు కల్పించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రొంగలి రాము, కూండ్రప్ప సోమునాయుడు, నడుపూరు సన్యాసిరావు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన వైసీపీ శ్రేణులు

మునగపాక, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి-అచ్యుతాపురం పూడిమడక రోడ్డుపై రోడ్డు ప్రమాదాల నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం వైసీపీ చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రమాదాలకు కారణాలు తెలిసినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ ఆది ఉమామహేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

'ఉపాధి పనులు కల్పించడంలో వివక్ష'



గ్రామ సర్పంచ్‌కు ఫిర్యాదు చేస్తున్న ఉపాధి కూలీలు

కోటవురట్ల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలిగుంట గ్రామంలో ఉపాధి కూలీలకు పనులు కల్పించడంలో అధికారులు వివక్ష చూపుతున్నారని గ్రామసర్పంచ్ వరహాలబాబురావు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం గ్రామంలో ప్రారంభించిన ఉపాధి పనుల్లో కొందరు కూలీలకే ఉపాధి కల్పించారని ఆరోపించారు. రాజకీయ నాయకుల ఒత్తిడి మేరకు ఇలా చేశారని కూలీలు తనకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయమై తాను ఎంపీడీవో కాశీవిశ్వనాథంకు ఫిర్యాదు చేశానన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు ఆపేసి మంగళవారం నుంచి అన్నిగ్రూపులకు పనులు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఆ నాలుగు గ్రూపులకు చెందిన కూలీలు యాథావిధిగా పనులు చేశారన్నారు. మంగళవారం కూలీలందరికీ పనులు కల్పించకపోతే ఎంపీడీవో కార్యాలయం వద్ద కూలీలతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

35 లీటర్ల సారాతో ముగ్గురు మహిళల అరెస్టు

పాయకరావుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు మండలంలో వివిధ గ్రామాల్లో దాడులు నిర్వహించి ముగ్గురు మహిళల నుంచి 35 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. పాయకరావుపేట పట్టణ శివారులో ఒక మహిళను 10 లీటర్ల సారాతో పట్టుకున్నారు. ఈదటం గ్రామంలో ఒక మహిళ నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. గోపాలపట్నంలో ఒక మహిళను అదుపులోకి తీసుకుని ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరినట్టు ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

రెండు వరికుప్పలు దగ్ధం

పాయకరావుపేట రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాల్తేరులో ఆదివారం రాత్రి రెండు వరి కుప్పలు దగ్ధమయ్యాయి. ఇందుకు సంబంధించి సోమవారం పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో పాల్తేరు గ్రామ శివారులో కంకిపూడి వెంకటరావుకు చెందిన రెండు వరి కుప్పలను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టారు. దీన్ని గుర్తించిన సమీప రైతులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి తెచ్చినప్పటికీ అప్పటికే వరి కుప్పలు పూర్తిగా దగ్ధమయ్యాయి. బాధిత రైతు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

'బాల్య వివాహాలు చేయడం నేరం'

నక్కపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు గ్రామంలో సోమవారం బాల్య వివాహాల నివారణపై చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ అండ్ మోనటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ కమిటీ ప్రతినిధి డి. లోవరాజు పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయడం నేరమని, బడిఈడు గల పిల్లలతో పనిచేయించడం కూడా నేరమన్నారు. సమావేశంలో సర్పంచ్ నూకరత్నం, ఎంపీటీసీ సభ్యుడు మధు, వీఆర్వో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం ప్రారంభం



ఎలమంచిలి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి పెంజెరువు వద్ద నూతనంగా నిర్మించిన దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ప్రారంభం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొఠారు వరప్రసాద్, శ్రీదేవి దంపతుల చేతుల మీదుగా ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో అన్నసమరాధనను నిర్వహించారు.

కార్డుదారులు ఆధార్ ఈకేవైసీ చేయించుకోవాలి

రాంబిల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేషన్ కార్డులు ఉన్న కుటుంబాల వారు ఈ నెల 31లోపు ఆధార్ ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబాల్లో ఐదేళ్ల వయస్సు నుంచి 60 సంవత్సరాలులోపు గల వారు గ్రామ సమీపంలో డీలర్ వద్దకు వెళ్లి ఆధార్ ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ పెండింగ్ జాబితా డీలర్ల వద్ద అందుబాటులో ఉంచామన్నారు. ఈకేవైసీ చేయించుకోని కార్డుదారులకు ఏప్రిల్ 1 నుంచి నిత్యావసర వస్తువులు నిలిపివేస్తామన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

రాంబిల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు మాట్లాడుతూ.. జడ్.చింతువా, తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ జయమాధవికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు దోని కాశియ్య, ఎస్.నారాయణరావు, ఎరుపెల్లి రాము, చెల్లూరి నూకన్న, సీహెచ్ పవన్‌కుమార్, సీహెచ్ గంగరాజు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా బోయిలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

అచ్యుతాపురం రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చీమలాపల్లిలో బోయిలమ్మ విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం గ్రామంలో అమ్మవారి పండగను నిర్వహిస్తామని గ్రామస్థులు తెలిపారు. ఈ ప్రతిష్ఠ కార్యక్రమంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, వైసీపీ నాయకుడు బొడ్డేడ ప్రసాద్, గ్రామ సర్పంచ్ సియాద్రి బుజ్జి, గ్రామ పెద్దలు సియాద్రి బైరాగి, మామిడి శివ అప్పారావు, నగిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు



మెయిన్ స్కూల్లో విద్యార్థిని పరీక్షిస్తున్న డాక్టర్ సుభాష్

పాయకరావుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ అయోడిన్ డెఫిషియన్సీ డిజార్డర్స్ కంట్రోల్ ప్రోగ్రాంలో భాగంగా సోమవారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అయోడిన్ లోపం గుర్తించేందుకు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ డి.సుభాష్ మంగవరంరోడ్డులోని ఎంపీపీ మెయిన్, జడ్పీ బాలికోన్నత పాఠశాల, కేహెచ్.వాడ ఎంపీపీ పాఠశాలల్లో 90 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. పలువురు విద్యార్థుల నుంచి యూరిన్ శాంపిల్స్, సాల్ట్ శాంపిల్స్ తీసి పరీక్షల నిమిత్తం డీఎంహెచ్‌ఓకి పంపించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ పీవీ.రమణ, హెల్త్ సూపర్‌వైజర్ ఎం.నాగేశ్వరరావు, సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

149 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఎలమంచిలి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జంపపాలెం ప్రాథమిక, జెడ్పీ హైస్కూల్లో 149 మంది విద్యార్థులకు రేగుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి సుగుణ సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు అయోడిన్, యూరిన్ పరీక్షలు నిర్వహించి, మందులు అందజేసారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శాస్త్రి, వైఎన్.రాజు, ఉపాధ్యాయులు బొడ్డేడ సత్యనారాయణ, శ్రీనివాసరావు, శివ, షబ్బీర్ పాల్గొన్నారు.

ఎలమంచిలిలో అరగంట ఆగిన స్పెషల్ ట్రైన్

ఎలమంచిలి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి):అనకాపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం జరిగిన ప్రమాదం కారణంగా ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో పలు రైళ్ల ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎలమంచిలి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు పూర్తికాకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు ప్రయాణించే స్పెషల్ ట్రైన్‌ను ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో అర్థగంటకు పైగా నిలిపివేశారు. అనకాపల్లిలో పనులు పూర్తి కావడంతో రైళ్ల రాకపోకలు సాగించడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు, ఎస్.రాయవరం సబ్ స్టేషన్‌ల పరిధిలోని సోముదేవుపల్లి, ఎస్.రాయవరం ఫీడర్లలో గ్రామాలకు మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఎస్.రాయవరంటౌన్, బనవపాడు, లింగరాజుపాలెం, కర్రివానిపాలెం, వెంకటాపురం, సైతారుపేట, సర్వసిద్ధి, వేమగిరి, పేటసూదిపురం, వాకపాడు, జేవీ పాలెం గ్రామాల్లో విద్యుత్ ఉండదన్నారు. అలాగే చినఉప్పలం ఆక్వా ప్రదేశాలు, కాయిల్ కంపెనీలతోపాటు సోముదేవుపల్లిలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

నక్కపల్లి వారపు సంత వేలం

నక్కపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లిలో ప్రతీ శుక్రవారం జరిగే వారపు సంతలో ఆశీలు వసూలుకు సోమవారం వేలం పాటను ఎంపీడీవో సీతారామరాజు నిర్వహించారు. ఈ వేలంలో 28 మంది పాటదారులు పాల్గొనగా.. నక్కపల్లికి చెందిన దేవవరపు కొండలరావు రూ.16.11 లక్షలకు పాడుకున్నారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం రూ.28వేలు ఆదాయం ఎక్కువగా వచ్చింది.

నేడు పోక్సో చట్టంపై అవగాహన సదస్సు

అచ్యుతాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టంపై అవగాహన సదస్సు మంగళవారం తమ కళాశాల ప్రాంగణంలో జరుగుతుందని అచ్యుత కళాశాల కరస్పాండెంట్ పల్లి శేషగిరిరావు తెలిపారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ఎలమంచిలి కోర్టు సివిల్ జడ్జి పి. విజయ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు.

నూకాంబిక జాతర ఏర్పాట్లు పరిశీలన


జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

అనకాపల్లి టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక అమ్మవారి జాతర ఏర్పాట్లను సోమవారం అధికారులు, పలువురు నాయకులు పరిశీలించారు. జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా సన్నాహాలు జరుగుతున్నాయి. ఉత్సవ ప్రత్యేక అధికారిణి కె.శోభారాణి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక దృష్టిసారించారు. ఎప్పటికప్పుడు సిబ్బందికి పలు సూచనలు చేస్తున్నారు. క్యూలైన్లు, ఆలయ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, క్యూలైన్‌లో ఉన్న భక్తులకు తాగునీరు అందించడంతో పాటు పిల్లలకు పాలు అందుబాటులో ఉంచాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని ఆయా అధికారులకు సూచించారు. జాతర ఏర్పాట్ల పరిశీలనలో జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ), డీఎస్పీ ఎం.శ్రావణి, సీఐలు టీవీ విజయ్‌కుమార్, ఎం.వెంకట నారాయణ, ఆలయ ఈవో వెంపలి రాంబాబు, ఆలయ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను తదితరులు

నిరుద్యోగ భృతి చెల్లించాలని ఏఐవైఎఫ్ ఆందోళన


భిక్షాటన చేస్తూ నిరసన తెలియజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

తుమ్మపాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ భృతిని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు డిమాండ్ చేశారు. ఫెడరేషన్ ప్రతినిధులతో కలిసి సోమవారం నెహ్రూ చౌక్‌లో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద భిక్షాటన చేస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు మాట్లాడుతూ అధికారం చేపట్టిన వెంటనే నిరుద్యోగులకు రూ.మూడు వేలు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చినా నేటి వరకు అమలు చేయకపోవడం దారుణమన్నారు. అలాగే, మెగా డీఎస్సీతో పాటు ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వం ప్రతి ఎన్నికల్లో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను మోసం చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ప్రతినిధులు జి.రాధాకృష్ణ, జిల్లా అధ్యక్షుడు వేముల కన్నబాబు, నాయకులు ఫణేంద్రకుమార్, జగదీష్, సింహాద్రి, నవీన్, సురేష్, తరుణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

‘రొయ్యల కర్మాగారం కార్మికులను ఆదుకోవాలి’


క్షతగాత్రులను పరామర్శిస్తున్న వామపక్షాల నాయకులు

కొత్తూరు/తుమ్మపాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పులపర్తి వద్ద గల రొయ్యల కర్మాగారానికి ఏ-షిఫ్ట్ విధులకు వస్తున్న బస్సు బోల్తా పడిన ప్రమాదంలో 30 మందికి గాయాలు కాగా, వీరిలో 11 మందిని అనకాపల్లి ఉషా ప్రైమరీ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు కె.లోకనాథం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, సీఐటీయూ నాయకుడు గంటా శ్రీరామ్‌లు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొందూరు గ్రామం నుంచి బస్సు 30 మంది కార్మికులతో ఉదయం ఐదు గంటలకు బయలుదేరి వస్తుండగా గుమ్మలూరు గ్రామం వద్ద ఆటోను తప్పించబోయి బోల్తాపడిందన్నారు. ఈ ప్రమాదంలో సిహెచ్.సంతోషి, ఎస్.మహాలక్ష్మి, కె.తులసి, హెచ్.లక్ష్మి, వరలక్ష్మి, ఎం.హేమలత, ఎం.భారతి, వి.మంగ, జి.స్వాతి, సిహెచ్.లక్ష్మి, సిహెచ్ నూకరాజులకు గాయాలయ్యాయన్నారు. వీరందరికీ మెరుగైన వైద్యం కోసం, కోలుకొని తిరిగి విధులకు వచ్చేంత వరకు పూర్తి వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ ప్రమాదంలో క్షతగాత్రులను సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫణేంద్ర కుమార్, వేముల కన్నబాబు, వియ్యపురాజు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

‘ప్లాంట్’ను పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ అసెస్‌మెంట్ పరీక్ష (ప్లాంట్)ను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. ‘ప్లాంట్’ను ఈ నెల 23వ తేదీన నిర్వహించడానికి సంబంధిత శాఖల అధికారులతో సోమవారం కలెక్టరు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమంలో భాగంగా జిల్లాలో స్వయం శక్తి సంఘాల్లో నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులను చేయడానికి మొదటి దశలో 11,900 మంది అభ్యాసకులను నమోదు చేసినట్లుచెప్పారు. ప్రతి పది మందికి ఒకరు చొప్పున 1,190 మంది అక్షరాస్యులతో ఆయా గ్రామాల్లో అక్షరాస్యతా కేంద్రాలను ఏర్పాటు చేసి వలంటీరీ టీచర్ల ద్వారా చదువు నేర్పడం జరిగిందన్నారు. ఈ అభ్యాసకులకు 23వ తేదీన అంగన్‌వాడీ కేంద్రం లేదా పాఠశాలలో పరీక్ష నిర్వహించాలని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ లేదా సెకండరీ గ్రేడ్ టీచరు పరీక్షా నిర్వాహకులుగా వ్యవహరించాలని పేర్కొన్నారు. వయోజన విద్యా శాఖ నుంచి పరీక్ష పేపర్లు, సంబంధిత సామగ్రి సరఫరా అవుతుందని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకొని పరీక్షను నిర్వహించి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వయోజన విద్య ఉపసంచాలకులు ఎస్ఎస్ వర్మ, నోడల్ అధికారి డి.చిన్నికృష్ణ, డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి, ఐసీడీఎస్ పీడీ కె.అనంతలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గాంధీ మార్కెట్‌లో ఆక్రమణలపై జెడ్సీకి ఫిర్యాదు

అనకాపల్లి టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గాంధీ మార్కెట్‌లో ఆక్రమణలను తొలగించాలని జీవీ ఎంసీ జోనల్ కమిషనర్ బీవీ రమణను బీజేపీ మం డల మాజీ అధ్యక్షుడు, సంతోషిమాత ఆలయ చైర్మన్ మారిశెట్టి భాస్కరరావు కోరారు. ఈ మేరకు సోమవా రం వినతి పత్రాన్ని అందజేశారు. మార్కెట్‌లో కొంతమంది దళారులు ఇష్టానుసారంగా జీవీఎంసీ స్థలాలను ఆక్రమించి, వ్యాపారాలు సాగిస్తున్నారని ఆరోపించారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. అనకాపల్లిలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలు

అనకాపల్లి టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో కార్మికుల రిలే నిరాహార దీక్షలు సోమవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ కార్మికులపై తప్పుడు కేసులు రాసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో పీజీ భవాని, కె.శారదా, బీబీ రావు, బీఎస్ అప్పడు కూర్చున్నారు.

అర్జీలకు గ్రామ, మండల స్థాయిలోనే పరిష్కారం

▸▸ అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం ▸▸ ప్రజా సమస్యల పరిష్కార వేదికపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచన

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను గ్రామ, మండల స్థాయిలోనే పరిష్కరించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జేసీ జాహ్నవి, డీఆర్‌వో సత్యనారాయణరావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు గ్రామ, మండల స్థాయిలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మండల స్థాయిలో ప్రజా సమస్యలు పరిష్కరించడం వలన ప్రజలకు సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. పెండింగ్ అర్జీలను వెంటనే పరిష్కరించి, తాజాగా అందిన అర్జీలను వచ్చే వారం నాటికి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ముగిసే సమయానికి 340 అర్జీలు అందినట్టు కలెక్టరేట్ విభాగం అధికారులు తెలిపారు.


కలెక్టరేట్‌లో అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, చిత్రంలో జేసీ జాహ్నవి

పోలీస్ శాఖకు 40 అర్జీలు

పోలీస్ శాఖకు అందే అర్జీలను పరిష్కరించి, బాధితులకు న్యాయం చేసేందుకు అంతా కట్టుబడి ఉన్నామని ఏఎస్పీ ఎల్.మోహనరావు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ ఎల్.మోహనరావు మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో అందే అర్జీల విషయంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ముగిసే సరికి 40 అర్జీలు అందాయి. ఎస్ఐ డి.వెంకన్న, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.


అర్జీని స్వీకరిస్తున్న ఏఎస్పీ మోహనరావు

పక్కా ఏర్పాట్ల నడుమ టెన్త్ పరీక్షలు

▸▸ గంట ముందు నుంచే విద్యార్థులు రాక


సబ్బవరంలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులకు తనిఖీలు చేస్తున్న పోలీసులు

అనకాపల్లి టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచే విద్యార్థినీ విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవడం ఆరంభమైంది. తొమ్మిది గంటలకు నిర్వాహకులు ఆయా కేంద్రాల్లోకి అనుమతించారు. అనకాపల్లి పట్టణంలోని గాంధీనగరం జీవీఎంసీ హైస్కూల్, పట్టణ బాలికోన్నత పాఠశాల, గవరపాలెం బాలికోన్నత పాఠశాల, గవరపాలెం ఉన్నత పాఠశాల, సంయుక్త, నారాయణ, చైతన్య, భాష్యం స్కూళ్లతో పాటు ఏఎంఏఎల్ హైస్కూల్‌లో తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పలువురు అధికారులు ఆయా కేంద్రాలను తనిఖీ చేశారు.

తుమ్మపాల : అనకాపల్లి మండలం కొండుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు వెళ్లి వచ్చేందుకు ఎంపీటీసీ కో-ఆప్షన్ సభ్యుడు బొండా అప్పలరాజు తన సొంత నిధులతో ఆటోలను సోమవారం ఏర్పాటు చేశారు. సుమారు 30 మంది విద్యార్థులు మార్టూరు, మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు రాసేందుకు వెళ్లాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ బొండా ఉమా, నాయకులు గనిరెడ్డి శ్రీరామ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


అనకాపల్లిలో బస్సులో పరీక్షా కేంద్రాలకు వెళ్తున్న విద్యార్థులు

కశింకోట మండలంలో...

కశింకోట : మండలంలోని పదో తరగతి పరీక్ష తొలిరోజు ప్రశాంత వాతావరణంలో జరిగింది. డీపీఎన్ జడ్పీ హైస్కూల్, సెయింట్ జాన్స్, జడ్పీ బాలికోన్నత పాఠశాల, కన్నూరుపాలెం జడ్పీ హైస్కూల్, తాళ్లపాలెం సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ స్కూల్, జిల్లా పరిషత్ హైస్కూల్, నర్సింగబిల్లి జడ్పీ హైస్కూళ్లలో మొత్తం 1071 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, తొలి రోజు పరీక్షకు 1066 మంది హాజరయ్యారు. కాగా భవిత కేంద్రంలో పదో తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థి పరీక్షకు హాజరయ్యాడు.

పరవాడ మండలంలో..

పరవాడ : మండల వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 1037 మంది విద్యార్థులకు హాజరు కావాల్సి ఉండగా, తొలిరోజు పరీక్షకు 1036 మంది హాజరయ్యారు. పెదముషిడివాడ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో ఒక విద్యార్థి పరీక్షకు హాజరు కాలేదని ఎంఈవో దివాకర్‌రావు తెలిపారు.

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : మండలంలో పదో తరగతి విద్యార్థుల పరీక్షల కోసం ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. తొలిరోజు పరీక్షకు నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈవో లక్ష్మణరావు తెలిపారు. మొత్తంగా 940 మందికి పరీక్షలు రాయాల్సి ఉండగా, తొలిరోజు 936 మంది హాజరైనట్టు చెప్పారు.

భారీ వాహనాలను కట్టడి చేయాలి

▸▸ విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద సేఫ్టీ గడ్డర్‌ను టిప్పర్ ఢీకొన్న ప్రాంతాన్ని పరిశీలించిన పలు పార్టీల నాయకులు

▸▸ భారీ లోడుతో వస్తున్న వాహనాలపై చర్యలకు డిమాండ్


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకీ

అనకాపల్లి టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద సోమవారం వేకువజామున సేఫ్టీ గడ్డర్‌ను టిప్పర్ ఢీకొన్న ప్రాంతాన్ని పలు రాజకీయ పార్టీల నాయకులు పరిశీలించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన విషయాన్ని రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అయిన అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ఆయన అధికారులతో మాట్లాడి మరమ్మతులు తక్షణమే జరిగేలా ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. అండర్‌బ్రిడ్జి కింద భారీ వాహనాలు వెళ్లకూడదని ఐరన్ రాడ్లతో హద్దులను ఏర్పాటు చేసినప్పటికీ భారీ వాహనదారులు పట్టించుకోకుండా అండర్‌బ్రిడ్జి కింద నుంచి వెళుతూ అనేక ప్రమాదాలకు కారణమవుతున్నారని ఆరోపించారు. వీటిని వెంటనే నివారించాల్సిన అవసరం అధికారులపై ఉందన్నారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, పలువురు టీడీపీ నాయకులు కూడా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సంఘటన విషయాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు తెలియపరిచామన్నారు. భారీ లోడు వస్తున్న మైనింగ్ లారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వైసీపీ నాయకులు బొడ్డేడ ప్రసాద్, మందపాటి జానకిరామరాజు, మలసాల కుమార్‌రాజా తదితరులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. భారీ వాహనాలను అదుపు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం పట్ల విమర్శలు గుప్పించారు. అధికారుల నిర్లక్ష్యం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు కె.లోకనాథం అన్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ రైల్వే అండర్‌బ్రిడ్జి కింద సేఫ్టీ గడ్డర్‌ను క్వారీ లారీలు ఢీకొనడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఘటన జరిగిన వెంటనే లోకోపైలెట్ గూడ్స్ రైలును నిలిపివేయడం అభినందనీయమన్నారు. ఆయన వెంట సీపీఎం నాయకులు ఆర్. శంకరరావు, గంటా శ్రీరామ్, అల్లు రాజు తదితరులు ఉన్నారు. అలాగే, సంఘటనా స్థలాన్ని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, బీఎస్పీ నేత నూడికొండ మాణిక్యాలరావు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రతి నిధి వియ్యపు రాజుతో పాటు పలు పార్టీల నాయ కులు పరిశీలించారు.


సంఘటన వివరాలు తెలుసుకుంటున్న టీడీపీ నాయకుడు రత్నాకర్

సమస్యల పరిష్కారానికి ఆందోళనలు



పరవాడ ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన

పరవాడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక టిడ్కో గృహ సముదాయంలో నివాసం ఉంటున్న మహిళలు సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం మాట్లాడుతూ గృహ సముదాయంలో వీధి లైట్లు లేకపోవడంతో రాత్రిళ్లు భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్యం కూడా అధ్వానంగా ఉందని, రేషన్ వాహనం గృహ సముదాయం వద్దకు రావడం లేదని దీనివల్ల రేషన్ కోసం మహిళలు అవస్థలు పడాల్సి వస్తోందని వివరించారు. తక్షణమే ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆమె కోరారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో కె. ధర్మారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.బంగారమ్మ, డి. లక్ష్మి, ఆర్.సీతామహాలక్ష్మి, ఆర్.ఇందుమతి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని ర్యాలీ

కశింకోట : పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.400 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంతబయలు నాలుగురోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కుమార్, కొండబాబు మాట్లాడుతూ గత ఐదేళ్ల నుంచి వేతనాలు పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు తమ సమస్యలను విన్నవించుకున్నా ఫలితం లేకపోతోందని వాపోయారు. గత నెలలో జిల్లా కలెక్టర్, డీపీవో, డీఎల్‌పీవో, ఎంపీడీవో, సర్పంచ్, వార్డుమెంబర్లకు వినతిపత్రాలు అందజేయడం ద్వారా సమస్యలను

వారి దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. మార్చి నెలాఖరుతో టెండర్ల కాలపరిమితి పూర్తవుతుందని ఇప్పటి వరకు మూడు నెలల జీతాలు ఇవ్వాల్సి ఉందన్నారు. పారిశుధ్య కార్మికులను కార్యాలయ పనులకు వాడుకుంటున్నారని, దీనివల్ల పనిభారం కూడా పెరుగుతుందని వాపోయారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు రామాజీ, రాణి, సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



కశింకోట పంచాయతీ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు నినాదాలు

సౌకర్యాలు కల్పించాలని నిరసన

సబ్బవరం : మండలంలోని పలు గ్రామాల్లో కాలువలు, రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం మండల అధ్యక్షురాలు ఉప్పాడ సత్యవతి డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సోమవారం ఆమె సబ్బవరంలో సమస్యలు తెలుసుకుని నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు అమలు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు గౌరీసు, ముఠా యూనియన్, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

అసెంబ్లీ దృష్టికి
సబ్బవరం పీహెచ్‌సీలో సమస్యలు

▸▸ ప్రస్తావించిన ఎమ్మెల్యే ‘పంచకర్ల’


అసెంబ్లీలో మాట్లాడుతున్న పంచకర్ల

సబ్బవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంలో గల పీహెచ్‌సీలో సమస్యలను సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 44 ఏళ్ల క్రితం 9.94ఎకరాల్లో నిర్మించిన ఆస్పత్రి భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరిందన్నారు. అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారికి ఆనుకొని ఉండడంతో పాటు నాలుగు నియోజకవర్గాల కూడలిలో సబ్బవరం పీహెచ్‌సీ ఉందన్నారు. రోజుకు మూడు వందల నుంచి నాలుగు వందల మంది ఔట్ పేషెంట్లు వచ్చే ఆసుపత్రిగా పేర్కొన్నారు. అటువంటి ఆసుపత్రిని గత వైసీపీ ప్రభుత్వం జీవో నెంబరు 143ను తీసుకొచ్చి 30 బెడ్లు, 44 మంది సిబ్బందితో ఉండే ఆసుపత్రిని 14 మంది సిబ్బందితో 6 బెడ్ల ఆసుపత్రి స్థాయికి తీసుకు వచ్చిందని మండిపడ్డారు. పీహెచ్‌సీ భవనం మరమ్మతులకు రూ.80 లక్షలు మంజూరయ్యాయని మంత్రి చెప్పారనీ, అయితే ఆ నిధులు ఏమాత్రం పనికి రావన్నారు. మరమ్మతులకు మంజూరు చేసిన రూ.80 లక్షలతో పాటు మరో రూ.రెండు మూడు కోట్లు మంజూరు చేసి, సీహెచ్‌సీ హోదా కల్పించి తగిన సిబ్బందిని నియమించాలని కోరారు.

ఈవీఎంల గోదాం తనిఖీ


ఈవీఎంల గోదాంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్

అనకాపల్లి రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎంల గోదామును కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఈవీఎం యంత్రాలు, సీసీ కెమెరాలు, అగ్నిమాపక పరికరాలు, భద్రతా ఏర్పాట్లను ఆమె తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో సత్యనారాయణరావు, ఆర్డీవో షేక్ ఆయాషా, కలెక్టరేట్‌లో సెక్షన్ సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ నాయుడు, తదిరులు పాల్గొన్నారు.

నేడు పరదేశిమాంబ అనుపోత్సవం



పరవాడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : భరణికం గ్రామంలో పరదేశిమాంబ పండగలో భాగంగా మంగళవారం అనుపోత్సవాన్ని నిర్వ హించ నున్నారు. ఇందుకు సంబంధించి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేపట్టారు. గ్రామంతో పాటు ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. రాత్రికి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సీఐ ఆర్.మల్లికార్జునరావు పర్యవేక్షణలో పోలీస్ బందోబస్తు నిర్వహించనున్నారు.

బంగారు తల్లి సేవా సమితి అధ్యక్షుడు వెంకటరావుకు అవార్డు


అవార్డు అందుకుంటున్న వెంకటరావు

సబ్బవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంలోని జోడుగుళ్లకు చెందిన బంగారు తల్లి సేవా సమితి అధ్యక్షుడు సింగంపల్లి వెంకటరావుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ అవార్డు లభించింది. గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా వెంకటరావు సేవలను గుర్తించి ఆదివారం ఈ అవార్డును అక్కడి ఎమ్మెల్యే ధూళిపాల నరేంద్ర కుమార్ అందజేశారు. అసోసి యేషన్ అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్, సంగం డెయిరీ చైర్మన్, తిరుమలశెట్టి కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద అభివృద్ధి పనులకు శ్రీకారం

లంకెలపాలెం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పెదముషిడివాడ పంచాయతీ పరిధి నక్కవానిపాలెం రామాలయం ముందు సీసీ ప్లాట్‌ఫాం నిర్మాణానికి సర్పంచ్ పల్లా నాగమణి సోమవారం శంకుస్థాపన చేశారు. నాయకులు పల్లా అప్పారావు, యలమర్తి బుజ్జి, అలమండ వెంకటలక్ష్మి, నారపిన్ని అప్పారావు, పైడిరాజు, ప్రసాద్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాలలో సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం

తుమ్మపాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ తుమ్మపాల ఇందిరానగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిహేనవ ఆర్థిక సంఘం నిధులు రూ. 20 లక్షలతో ఈరోడ్డు పనులు ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ధారాలమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

▸▸ అమ్మవారికి రూ. 50 వేలు విరాళం ఇచ్చిన గిడ్డి ఈశ్వరి


అమ్మవారిని దర్శించుకున్న గిడ్డి ఈశ్వరి

సీలేరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ధారాలమ్మ ఉత్సవాలను పార్టీలకు, మతాలకు అతీతంగా ఘనంగా నిర్వహించాలని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. సోమవారం జీకేవీధి మండలం ధారకొండ ఘాట్‌లో కొలువుదీరిన ధారాలమ్మ అమ్మవారిని ఆమె దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఈనెల 20 నుంచి ప్రారంభమయ్యే అమ్మవారి ఉత్సవాలపై చర్చించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా తన వంతుగా రూ.50 వేలు విరాళాన్ని అందజేస్తామని తెలిపారు. అలాగే జాతర అనంతరం ఆలయ పునర్నిర్మాణానికి సంబంధింత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని గిడ్డి ఈశ్వరి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సాంబశివరావు, ధారకొండ కూటమి నాయకులు గోవింద, చంద్రకళ పాల్గొన్నారు.

ధారాలమ్మను దర్శించుకున్న బాలరాజు

ధారాలమ్మ అమ్మవారిని సోమవారం గిరిజన సంక్షేమ శాఖ మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు దర్శించుకున్నారు. అమ్మవారికి బాలరాజు ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 20 నుంచి జరిగే అమ్మవారి ఉత్సవాల వివరాలు, ఏర్పాట్లపై అర్చకులు నారాణమూర్తిని అడిగి తెలుసుకున్నారు.

గిరిజన యువతకు వృత్తి నైపుణ్య కోర్సుల్లో శిక్షణ

▸▸ నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డాక్టర్ రోహిణి



చింతపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి):గిరిజన యువతకు వృత్తి నైపుణ్య కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు, గ్రామాల్లో స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డాక్టర్ పి. రోహిణి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె విలేకర్లతోమాట్లాడారు. అరకులో లైన్‌మన్ కోర్సులో శిక్షణ ఇస్తున్నామని, శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు ఏపీటీడీసీ, ఈపీడీసీఎల్, ట్రాన్స్‌కోలో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. పాడేరులో డొమస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ ఇస్తున్నామని, ఈ యువతకు 1900 కాల్ సెంటర్‌లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. రంపచోడవరంలో రిటైల్ అసోసియేట్ కోర్సులో శిక్ష ఇస్తున్నామని, శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు డీ మార్టులో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఏటపాకలో అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో శిక్షణ ఇచ్చి సీఆర్‌డీఏలో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఇప్పటి వరకు వృత్తి నైపుణ్య శిక్షణ సంస్థ ద్వారా జిల్లాలో 689మంది శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించామన్నారు. లొంగిపోయిన 120మంది మావోయిస్టులకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇచ్చి బ్యాంక్‌ల నుంచి రుణాలు అందజేస్తామన్నారు. జీకేవీధి మండలంలో 400మంది మహిళలకు టైలరింగ్‌పై శిక్షణ ఇచ్చి అచ్యుతాపురం బ్రాండిక్స్ కంపెనీలో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపే యువత ఏపీ వృత్తినైపుణ్య అభివృద్ధి సంస్థ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థినులకు ఆర్టీసీ బస్సు


జీనబాడు పరీక్ష కేంద్రానికి బస్సులో వెళ్తున్న విద్యార్థినులు

అనంతగిరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీనబాడు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలకు చెందిన 59 మంది పదో తరగతి విద్యార్థినులను, శివలింగపురం, కేజీబీవీ పరీక్ష కేంద్రాలకు ఆర్టీసీ బస్సులోని సోమవారం ఉచితంగా తరలించారు. జీనబాడు నుంచి విద్యార్థినులు ప్రతి ఏడాది కేజీబీవీలో ఉంటూ పరీక్షలు రాసేవారు. అయితే ఈ ఏడాది విద్యార్థినులకు సరిపడా వసతులు లేకపోవడం సిబ్బంది సుముఖత చూపలేదు. దీంతో విద్యార్థినుల సమస్యలపై జీనబాడు టీడీపీ నాయకుడు సురేశ్ ఆర్టీసీ విజయనగరం జోన్ రీజినల్ చైర్మెన్ సీవేరి దొన్నుదొర దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన ఆయన విశాఖపట్నం డిపో నుంచి ఆర్టీసీ బస్సును విద్యార్థినులు తరలింపుకు ఏర్పాటు చేయించారు. పరీక్ష అనంతరం తిరిగి పాఠశాలకు తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టారు. రెండు వైపులా సుమారు 120 కిలోమీటర్ల ప్రయాణం ఉంటుందని స్థానికులు తెలిపారు. దొన్నుదొర ప్రత్యేక చొరవపై విద్యార్థినుల తల్లిదండ్రులతో పాటుగా పాఠశాల హెచ్‌ఎం మల్లీశ్వరీ, నాయకుడు సురేశ్ హర్షం వ్యక్తం చేశారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు వెంటనే రద్దుచేయాలి

▸▸ సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి అప్పలనర్స



అనంతగిరిలో పాదయాత్ర చేపడుతున్న సీపీఎం నాయకులు

అనంతగిరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు వెంటనే రద్దుచేయాలని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాచైతన్య యాత్రను సోమవారం మండల కేంద్రంలోని చేపట్టారు. టోకూరు, పెదకోట, పెదబిడ్డ పంచాయతీలకు చెందిన గిరిజనులతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ గిరిజన చట్టాలను హక్కులను తుంగల్లో తొక్కి, కార్పొరేట్ కంపెనీలకు కేటాయించడంపై మండిపడ్డారు. గిరిజన ప్రాంతంలోని సహజ వనరులు గిరిజనులకే చెందాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు కారణంగా వేల ఎకరాలు గిరిజనులకు నష్టం వాటిల్లితుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతులను వెంటనే రద్దు చేయాలని, లేకపోతే గిరిజనులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, సర్పంచులు కిల్లో మోస్య, రూతు, కొండలరావు, నాగులు, దేముడమ్మ, జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

పాడేరులో మళ్లీ ట్రాఫిక్ కష్టాలు

▸▸ రహదారికిరువైపులా దుకాణాల ఏర్పాటు

▸▸ చోద్యం చూస్తున్న అధికారులు



పాడేరు ప్రధాన రహదారిలో మళ్లీ ఏర్పాటైన దుకాణాలు

పాడేరురూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పాడేరు ప్రధాన రహదారి (ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డుకు) ఇరువైపులా దుకాణాలు మళ్లీ వెలిశాయి. దీంతో వాహనచోదకులకు ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి.

అల్లూరి జిల్లా కేంద్రంగా మారిన తరువాత పాడేరులో వాహనాల రద్దీ పెరగడంతో వాహనచోదకులకు, స్థానికులకు ట్రాఫిక్ కష్టాలు ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని గుర్తించిన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీస్, ఆర్అండ్‌బీ అధికారులు పాతబస్టాండ్ నుంచి సినిమాహాలు సెంటర్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు రోడ్డుకు ఇరువైపులా అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను మూడు నెలల క్రితం తొలగించారు. దాంతో రహదారి విస్తారం కావడంతో ట్రాఫిక్ సమస్య తీరిందని వాహనదారులు సంబరపడ్డారు. వంద రోజులు పూర్తి కాకముందే ఈ రహదారిలో మళ్లీ పండ్లు, వస్త్ర, జూస్ దుకాణాలు ప్రారంభం కావడంతో కొనుగోలుదారులు ప్రధాన రహదారిపైనే వాహనాలను నిలిపి, కొనుగోలు చేస్తున్నారు. సినిమాలు సెంటర్ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీకి అనుకొని ప్రతీ ఆది, మంగళ, శుక్రవారాలు చేపల వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తుండడంతో ఈ మూడు రోజులు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని వాహన చోదకులు తెలిపారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమంగా మళ్లీ ఏర్పాటు చేసిన చేపలు, పండ్లు, జూస్, వస్త్ర తదితర దుకాణాలను తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. లేకుంటే కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని పలువురు వాహనదారులు తెలిపారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం


పాడేరురూరల్: హాల్ టిక్కెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు


జి.మాడుగులలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జేసీ అభిషేక్ గౌడ

పాడేరురూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, అసిస్టెంట్ కమిషనర్‌శశికుమార్ తెలిపారు. మండలంలో తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు 1,002 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 998 మంది హాజరు కాగా నలుగురు విద్యార్థులు గైర్ హాజరయ్యారన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆరు పరీక్ష కేంద్రాల వద్ద సీఐ డి.దీనబంధు పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

జి.మాడుగులలో..

మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో జరిగిన పదో తరగతి పరీక్షలకు తొలి రోజు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండలంలో 577 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 572 మంది హాజరయ్యారు. ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయినట్టు ఎంఈవో బాబురావు పడాల్ చెప్పారు. అలాగే గురుకుల పాఠశాల, కొత్తూరు బాలురు-1, ప్రభుత్వ హైస్కూల్, గాంధీనగర్ పరీక్షా కేంద్రాలను జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ్ పరిశీలించారు.

చింతపల్లిలో...

మండలంలో పదో తరగతి పరీక్షలకు సోమవారం తొలి రోజు 21మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో పీటీవీవీ ప్రసాద్ తెలిపారు. స్థానిక జడ్పీ హైస్కూల్ సెంటర్‌లో 180మంది హాజరయ్యారన్నారు. ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్ష కేంద్రంలో 11మందికి తొమ్మిది మంది హాజరయ్యారన్నారు. గిరిజన సంక్షేమ శాఖ బాలుర-1లో 180మందికి 175, ఓపెన్ స్కూల్‌లో 10మంది 9, బాలుర-2లో రెగ్యులర్ 155కి 150 మంది, ఓపెన్ స్కూల్‌లో 12 మందికి 11 మంది, బాలికలు పాఠశాలలో రెగ్యులర్ 170మందికి 161 మంది, ఓపెన్ స్కూల్‌లో 26మందికి 24మంది హాజరయ్యారన్నారు.

సీలేరులో...

సీలేరులో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాని చీఫ్ సూపరింటెండెంట్ పి.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం తొలిరోజు తెలుగు పరీక్షకు 153 మంది విద్యార్థులకు గాను 151 మంది హాజరయ్యారని తెలిపారు. ఇద్దరు గైర్హాజరయ్యారన్నారు.

కొయ్యూరులో..

పదో తరగతి పరీక్షలకు తొలి రోజు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండలంలోని మూడు పరీక్షా కేంద్రాలలో 680 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 667 మంది హాజరైనట్టు ఎంఈవో రాంబాబు తెలిపారు.

గూడెంకొత్తవీధిలో..

మండల కేంద్రంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో శతశాతం విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. సోమవారం తొలి రోజు తెలుగు పరీక్షలకు 557 మంది విద్యార్థులు పరీక్ష రాయల్సి ఉండగా.. అందరూ హాజరయ్యారు. పెదవలస హైస్కూల్‌కు చెందిన దివ్యాంగ విద్యార్థి కాకూరి బాబుకి అదే పాఠశాలలో చదువుతున్న తొమ్మిదోవ తరగతి విద్యార్థి పి.రాముని లేఖరి(స్క్రైబ్)ను ఏర్పాటు చేశామని చీఫ్ సూపరింటెండెంట్ పల్లవి తెలిపారు.

పెదబయలులో...

పెదబయలులో పది పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని మూడు కేంద్రాలలో పోలీసు బందోబస్తు నడుమ పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారు. 13 ఉన్నత పాఠశాలల నుంచి మొత్తం 617 మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా, మొదటి పరీక్షకు ఎనిమిది మంది గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారి కొమ్ము క్రిష్ణమూర్తి తెలిపారు.

రెండు కిలోమీటర్లు నడవాల్సిందే..

పెదబయలు మండలంలో చాలా దూరం నచిడి వెళ్లి విద్యార్థులు పరీక్షలు రాయాల్సి వచ్చింది. మూడు కేంద్రాలు జంబ్లింగ్ విధానం వల్ల వేరే పాఠశాలల విద్యార్థులకు ఏర్పాటు చేశారు. అయితే జెడ్పీ ,గురుకుల పాఠశాలల విద్యార్థులు తమ పరీక్ష కేంద్రాలకు సుమారు రెండు కిలోమీటర్లు నడుదుకుంటూ వెళ్లి పరీక్ష రాస్తున్నారు. అలాగే తురకలవలస జీటీడబ్ల్యూ బాలికల పాఠశాల విద్యార్థినులు తురకలవలసలో తెల్లవారు జామున ఆర్‌టీసీ బస్సు ఎక్కి రోగులపేట జంక్షన్‌లో దిగుతున్నారు. అక్కడి నుంచి గురుకుల పాఠశాలకు సుమారు ఒకటిన్నర కిలోమీటర్లు నడిచి వెళ్లి పరీక్షలు రాస్తున్నారు. తిరుగు ప్రయాణంలోనూ వారికి నడకయాతన తప్పడం లేదు. ఆయా పాఠశాలల యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల ఇబ్బందులకు గురవుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఆటోలు ఏర్పాటు చేసి ఉన్నా శ్రమ తగ్గేదని వారు వాపోతున్నారు. అధికారులు, పాఠశాల యాజమాన్యం స్పందించి వాహనాలు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ముంచంగిపుట్టులో...


ముంచంగిపుట్టులో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 483 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. మొదటి రోజు 478 మంది విద్యార్థులు హాజరుకాగా, ఐదుగురు గైర్హాజరయ్యారని ఎంఈవో క్రిష్ణమూర్తి తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

అనంతగిరిలో...

మండలంలోని అనంతగిరి, కొత్తవలస, శివలింగపురం, కొత్తూరు కేజీబీవీ పరీక్ష కేంద్రాల్లో 717 మంది విద్యార్థులకు పరీక్షలు రాయాల్సి ఉండగా, మొదటి రోజు 706 పరీక్షకు హాజరయ్యారు. 11 మంది గైర్హాజరయ్యారని ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ తెలిపారు.. శివలింగపురం,కొత్తూరు కేజీబీవీ పరీక్ష కేంద్రాలను సీఐ హిమగిరి పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ డీ.శ్రీనివాసరావు, ఎంఈవో కిల్లో బాలజీ, తదితరులు ఉన్నారు.

హుకుంపేటలో...

మండలంలోని 650 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, తొలి రోజు 645 మంది హాజరయ్యారు. హుకుంపేట పరీక్షా కేంద్రాన్ని గిరిజన సంక్షేమ శాఖ డీడీ రజిని పరిశీలించారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేదని ఆమె స్పష్టం చేశారు. ఎంఈవో ఈశ్వరరావు పాల్గొన్నారు.



పెదబయలు నుంచి జెడ్పీ, జీటీడబ్లూ పరీక్ష కేంద్రాలకు నడిచి వెళుతున్న విద్యార్థులు... గురుకుల పాఠశాల కేంద్రానికి పొలాల్లో నడిచి వెళ్తున్న విద్యార్థినులు

తేనెటీగల పెంపకానికి ఏజెన్సీ అనుకూలం

▸▸ ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి

చింతపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతం తేనెటీగల పెంపకానికి అనుకూలమని స్థానిక ఆచార్య ఎన్‌జీరంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. సోమవారం స్థానిక పరిశోధన స్థానంలో తేనెటీగల పెంపకంపై గిరిజన రైతులకు వారం రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. తేనెటీగల పెంపకాన్ని కుటీర పరిశ్రమగా అభివృద్ధి చేసుకుంటే మంచి ఆదాయం లభిస్తుందన్నారు. ప్రధానంగా వలిసెల పంట దిగుబడులపై తేనెటీగల ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. తేనెటీగల ద్వారానే వలిసెల పుష్పాలు సంపర్కం జరిగి దిగుబడి పెరుగుతుందన్నారు. గిరిజన ప్రాంతంలో వలిసెల పంట తగ్గిపోవడం వల్ల తేనె ఉత్పత్తులు తగ్గాయన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం నేషనల్ సీడ్ హబ్ కార్యక్రమంలో వలిసెల సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. గిరిజన ప్రాంతంలో నాలుగు రకాల జాతుల తేనెటీగలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వృత్తినైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డాక్టర్ పి. రోహిణి, శాస్త్రవేత్తలు సందీప్ నాయక్, జోగారావు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు

పాడేరురూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి):స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీ కోసం)కు రెండు వినతులు వచ్చాయని తహసీల్దార్ వంజంగి త్రినాథరావు నాయుడు, ఎంపీడీవో జె.తేజరతన్ తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జి.మాడుగులలో..

జి.మాడుగుల ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ఏడు వినతులు స్వీకరించినట్టు తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో డేవిడ్‌రాజు తెలిపారు. భూ సంబంధిత సమస్యలపై వినతులు వచ్చినట్టు చెప్పారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

చింతపల్లిలో..

ప్రజల ఫిర్యాదులకు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మీకోసంలో ఐదు ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో డీటీ చంద్రశేఖరరావు,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వర్ణలత పాల్గొన్నారు.

ఆర్వీనగర్-పాలగెడ్డ రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోండి

▸▸ విశాఖపట్నం జిల్లా జడ్జిని కోరిన సీలేరు సర్పంచ్


విశాఖ జిల్లా జడ్జి ఆలపాటి గిరిధర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీలేరు సర్పంచ్ దుర్గో

సీలేరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్వీనగర్-పాలగెడ్డ అంతర్రాష్ట్ర రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకునేలా చొరవ చూపాలని ఉమ్మడి విశాఖ జిల్లా జడ్జి ఆలపాటి గిరిధర్‌ను సీలేరు సర్పంచ్ పి.దుర్గో, ఇతర నాయకులు కోరారు. ఆదివారం సీలేరులో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఈమేరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆర్వీనగర్ నుంచి పాలగెడ్డ వరకు ఉన్న అంతర్రాష్ట్ర రహదారి పదేళ్ల క్రితం నుంచి అధ్వానంగా తయారైందన్నారు. ఈ రోడ్డు విషయమై పలు పర్యాయాలు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేకపోయిందన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుంబిడిసింగిలో ఘనంగా నంది పండగ

జి.మాడుగుల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంబిడిసింగి గ్రామంలో నంది పండగ సోమవారం ఘనంగా ముగిసింది. గిరిజనుల సంప్రదాయం మేరకు నిర్వహించే ఈ పండగ ఐదు రోజులపాటు నిర్వహించారు. ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే నంది పండగ సందర్భంగా శంకుదేవుడుకి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ వేషధారణలతో యువకులు అలరించారు.

'జి.మాడుగుల అభివృద్ధికి సహకరించాలి'


జడ్పీ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు

జి.మాడుగుల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఉమ్మడి విశాఖ జిల్లా జడ్పీ చైర్మన్ జల్లిపల్లి సుభద్రను కోరినట్టు స్థానిక ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు చెప్పారు. సోమవారం వారు విశాఖపట్నం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి మండల సమస్యలను వివరించారు. జడ్పీ చైర్మన్ సానుకూలంగా స్పందించి, గిరిజన ప్రాంత అభివృద్ధికి హామీ ఇచ్చారన్నారు. జడ్పీ చైర్మన్‌ను కలిసిన వారిలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రామకృష్ణ, సర్పంచులు రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు సన్యాసిదొర, చిన్నారావు ఉన్నారు.

'బాలికల ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేయాలి'

పాడేరురూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ విద్యాలయంలో బాలికల ఉజ్వల భవిష్యత్తుకు ప్రిన్సిపాల్, ఏఎన్‌ఎంలు, పీఈటీలు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్.వి.స్వామినాయుడు కోరారు. సోమవారం స్థానిక కేజీబీవీ విద్యాలయంలో మెంటల్ హెల్త్ అండ్ కెరీర్ గైడ్స్‌పై కేజీబీవీల ప్రిన్సిపాల్, ఏఎన్ఎం, పీఈటీలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిక్షణ అందించేందుకు జిల్లాకు రాకేష్, వినీలా అనే కౌన్సిలర్స్‌ను అధికారులు నియమించారన్నారు. వారు శిక్షణ సమయంలో అందించిన విషయాలను బాలికలకు అర్థమయ్యే రీతిలో వివరించాలన్నారు. కార్యక్రమంలో గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(జీసీడీవో) కరణం సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీకి ఏర్పాట్లు

పాడేరురూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మే నెల 11, 12, 13వ తేదీలలో జరిగే పాడేరు మోదకొండమ్మ ఉత్సవాల నేపథ్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీకి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో పిచ్, గ్రౌండ్ సిద్ధమవుతోంది. పోటీల నిర్వాహకులు కె.దుర్గారావు, ఎస్.రాంబాబు దగ్గరుండి వాటిని తయారు చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజేతలకు బహుమతులను భారీగా ఇవ్వనున్నామన్నారు. పీస్ బాల్‌తో మేట్‌పై సుమారు నెల రోజులుపాటు క్రికెట్ పోటీలు జరుగుతాయన్నారు.

ముంచంగిపుట్టులో ఠారెత్తించిన ఎండ


నిర్మానుష్యంగా ఉన్న ముంచంగిపుట్టు ప్రధాన రహదారి

ముంచంగిపుట్టు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో రెండు రోజులుగా ఎండ ఠారెత్తిస్తున్నది. సోమవారం మండల కేంద్రంలో 33 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ అధికంగా ఉండటం వల్ల ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ఎవరూ సాహసించలేకపోయారు. మారుమూల గ్రామాల నుంచి సైతం మండల కేంద్రానికి ఆశించిన స్థాయిలో జనాలు రాలేదు. దీంతో నిత్యం రద్దీంగా ఉండే స్థానిక నాలుగు రోడ్ల కూడలిపై జన సంచారం తగ్గింది. ఎండ వేడి కారణంగా ఉక్కపోతకు ప్రజలు విలవిలలాడిపోతున్నారు. అలాగే పిల్లలు, వయసుపై బడిన వారు ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రైనేజీ నిర్మించాలని నిరసన


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, గిరిజనులు

డుంబ్రిగుడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మించాలని సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్థులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు మాట్లాడుతూ డ్రైనేజీ, సీసీ రోడ్డు లేకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు నీరంతా నివాస గృహలకు చేరడంతో పరిసరాలు బురదమయంగా మారుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.సూర్యనారయణ, తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో రక్తదానం చేస్తున్న పునీత్ రాజ్‌కుమార్ అభిమానులు

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

చోడవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నూకాంబిక కల్యాణ మండపంలో సోమవారం పునీత్ రాజ్‌కుమార్ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. కన్నడ సూపర్‌స్టార్ పునీత్ రాజ్‌కుమార్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఈపీడీసీఎల్ ఏడీఈ కుమార గౌరీప్రసాద్ ప్రారంభించారు. కన్నడ హీరో పేరిట నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. ఈ శిబిరంలో రక్తదాతల నుంచి 62 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సింగంపల్లి రవికుమార్, గోలుగొండ గణేశ్, తప్పెట్ల గణేశ్, బీల సతీశ్, సాయి యుగంధర్, చందక దాసు, అనిల్‌కుమార్, ముని పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు

▸▸ 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



గుడివాడలో బాగుచేస్తున్న బోరు

చీడికాడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాం శివారు గుడివాడ గ్రామంలో బోరు మరమ్మతు పనులను మెకానిక్‌లు ప్రారంభించారు. 'గ్రామాల్లో దాహం కేకలు' అనే శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కనకమ్మ స్పందించారు. ఈ మేరకు గుడివాడకు మెకానిక్‌లను పంపించి బోరు రిపేరు చేయించారు. మిగతా బోర్లు పనిచేయకోతే మెటీరియల్ తీసుకువచ్చి మరమ్మతు చేస్తామని ఈ సందర్భంగా మెకానిక్‌లు చెప్పారు. కాగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా బోర్‌వెల్ మెటీరియల్ రవాణా కోసం వ్యాన్ ఏర్పాటు చేయలేకపోయామని ఎంపీడీవో హేమసుందర్రావు తెలిపారు. అయితే బోర్లు మరమ్మతులు చేస్తున్నామని ఆయన చెప్పారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళిక తప్పనిసరి: ఎంపీపీ



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి

దేవరాపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక తప్పనిసరిగా సిద్ధం చేసుకోవాలని ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బ్లాకు పంచాయతీల అభివృద్ధికి భవిష్యత్ ప్రణాళికపై ఎంపీడీవో సువర్ణరాజు అధ్యక్షతన సోమవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ఏయే అవసరాలు ఉన్నాయో సూచించాలన్నారు. భవిష్యత్తులో వాటిని అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక తయారు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగా భవాని, వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ, ఏఈఈలు తేజ, కర్రి శంకరరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రూ.78 కోట్లతో అభివృద్ధి పనులు

▸▸ బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వీరసూర్యచంద్ర



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సూర్యచంద్ర, టీడీపీ నాయకులు

కృష్ణాదేవిపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం నియోజకవర్గంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవతో రూ.78 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర తెలిపారు. గొలుగొండ మండలం ఏఎల్‌పురంలోని వినాయకవీధిలో రూ.9 లక్షలతో మూడు సీసీ రోడ్ల నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది నెలల్లో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతున్నదన్నారు. ప్రస్తుతం గుంతలు లేని తారు రోడ్లు, గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల అభివృద్ధి పనులు చేస్తున్నట్టు చెప్పారు. ఒక్క ఏఎల్‌పురం పంచాయతీకే కోటి 28 లక్షల రూపాయలు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్, సర్పంచ్ లోచల సుజాత, ఎంపీటీసీ సభ్యుడు రుత్తల బుల్లిప్రసాద్, టీడీపీ, జనసేన నాయకులు బొడ్డు జమీలు, చిట్టిబాబు, అప్పలనాయుడు, దుంగల రమేశ్, సలాదుల ప్రసాద్, పారిశ్రామికవేత్త వెలగా కృష్ణారావు పాల్గొన్నారు.

పెరిగిన వెంకన్న హుండీ ఆదాయం



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

బుచ్చెయ్యపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వడ్డాది వెంకన్న కల్యాణ మహోత్సవాల సందర్భంగా స్వామివారి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. గత ఏడాది రూ.2.67 లక్షల ఆదాయం అధికంగా వచ్చింది. హుండీలో రూ.7.86 లక్షలు, టికెట్ల అమ్మకం ద్వారా రూ.4.86 లక్షలు, తలనీలాల ద్వారా రూ.25 వేలు, కొబ్బరిచిప్పల వేలం ద్వారా రూ.38 వేలు వెరసి మొత్తం రూ.12.75 లక్షలు వచ్చినట్టు ధర్మకర్త దొండా కన్నబాబు, ఈవో పీఎస్ఎస్.శర్మ తెలిపారు. ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు దొండా సన్యాసిరావు, వీర్ల సురేశ్, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వారపు సంతలో చింతపండుకు గిట్టుబాటు ధర



సంతలో విక్రయానికి తీసుకువచ్చిన చింతపండు

మాడుగుల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మాడుగుల వారపు సంతకు సోమవారం భారీగా చింతపండు వచ్చింది. పాడేరు మండలంలోని కక్కి, సలుగు, కందులపాలెం, ఈదులపాలెం, వంటలమామిడి, చీడికాడ మండలంలోని కోణాం, మాడుగుల మండలం కృష్ణంపాలెం నుంచి గిరిజన రైతులు అధికంగా చింతపండు తీసువచ్చిరు. సుమారు 35 కిలోల కావిడ చింతపండు రూ.2 వేలుకు పైగా ధర పలికింది. గిట్టుబాటు ధర వచ్చిందని గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

చెరకు రైతుల దిగాలు

షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం సకాలంలో పేమెంట్లు ఇవ్వకపోవడం... క్రషింగ్ ఎప్పటికప్పుడు నిలిచిపోవడం... లారీలు సమయానికి రాకపోవడం... చెరకు సక్రమంగా తోలకాలు జరగకపోవడం... వెరసి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫలితంగా ఒమ్మలి చెరకు కాటాలో చెరకు తోలకాలు డీలా పడ్డాయి.

ఒమ్మలి చెరకు కాటా పరిధిలో తోలకాలు డీలా



కాటాలో పేరుకుపోయిన చెరకు బండ్లు



ఒమ్మలి చెరకు కాటా వద్ద చెరకుతో నిలిచిపోయిన బండ్లు

మాడుగుల రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని మాడుగుల మండలంలో ఎం.కెవల్లాపురం, కేజేపురం, ఒమ్మలి చెరకు కాటాలు ఉన్నాయి. అయితే ఒమ్మలి కాటా పరిధిలో చెరకు తోలకాలు పరిస్థితి చాలా దారుణంగా మారింది. మిగిలిన కాటాలతో పోలిస్తే ఇది చాలా వెనుకబడింది. ఈ కాటా పరిధిలోని ఒమ్మలి, విజెపురం, గాదిరాయి, ఎం.కృష్ణాపురం, జేడీపేట, సత్యవరం గ్రామాలు ఉన్నాయి. సుమారు 800 మంది చెరకు సభ్య రైతులు ఉన్నారు. గతంలో ఈ కాటా ద్వారా సుమారు 20 వేల టన్నుల చెరకును గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి సీజన్‌లో తోలకాల ద్వారా సరఫరా చేసేవారు. రానురాను చెరకు తోలకాలు తగ్గుముఖం పట్టాయి.

గత ఏడాది సీజన్‌లో నాలుగు వేల టన్నుల చెరకు తోలకాలు లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, ఆపసోపాలు పడి మూడు వేల టన్నుల వరకు ఫ్యాక్టరీకి సరఫరా చేశారు. ప్రస్తుతం పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఈ ఏడాది 1500 టన్నులు లక్ష్యంగా పెట్టుకున్నా, అదీ కూడా పూర్తయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. ఇప్పటివరకు ఈ కాటా నుంచి సుమారు 600 టన్నులు మాత్రమే ఫ్యాక్టరీకి తోలకం చేశారు. ఇందులో 300 టన్నుల చెరకు ట్రాక్టర్ల ద్వారా రైతులు నేరుగా ఫ్యాక్టరీకి సరఫరా చేశారు. జనవరి 21వ తేదీన గోవాడ షుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ ప్రారంభమైంది. మార్చి 3వ తేదీ వరకు కేవలం రెండు లారీలు మాత్రమే చెరకు తోలకం చేశాయి. ఈ కాటాలోని కొంత మంది రైతులు ఈ నెల మార్చి 11వ తేదీన కాటాకు లారీలు రావడం లేదని, లారీలు కాటాకు పంపించాలని గోవాడ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని కలుసుకుని విన్నవించుకున్నారు. అయినప్పటికీ ఒక్క లారీ కూడా ఒమ్మలి కాటాకు రాలేదు. కాటాలో 16 చెరకు బండ్లతో సుమారు 70 టన్నుల చెరకు తోలకం జరకుండా ఉండిపోయినట్టు చెబుతున్నారు. చెరకు తోలకాలపై ఫ్యాక్టరీ యాజమాన్యం పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చెరకు తోలకాలపై ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రత్యేకంగా దృష్టిసారించాలని చెరకు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు



నర్సీపట్నంలో జెడ్పీహెచ్ స్కూల్ గేటు వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

నర్సీపట్నం/మాకవరపాలెం/కృష్ణాదేవిపేట/రోలుగుంట/బుచ్చెయ్యపేట/రావికమతం/మాడుగుల/దేవరాపల్లి/చీడికాడ/కె.కోటపాడు మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని పరీక్షా కేంద్రాల్లో తొలి రోజు సోమవారం పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు తమ ఇష్ట దైవానికి పూజలు చేసి పరీక్షా కేంద్రానికి వచ్చారు. నర్సీపట్నం మునిసిపాలిటీలోని అన్ని కేంద్రాల్లో 1853 మంది పరీక్షలకు హాజరు కావల్సి ఉండగా 1842 మంది రాశారు. 11 మంది గైర్హాజరయ్యారు. ఎంట్రన్స్ గేట్లు వద్ద పోలీసులు విద్యార్థులను తనిఖీ చేసి లోపలకు పంపించారు. ఏఎల్‌పురం హైస్కూల్ 180 మంది గాను 178 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రంలో మాస్ కాపీయింగ్ జరగకుండా డిపార్ట్‌మెంట్ అధికారిగా సుధాకర్ పరివేక్షించారు. అలాగే ఎస్ఐ తారకేశ్వరరావు, పోలీసు సిబ్బంది విద్యార్థులను తనిఖీలు చేసి పంపించారు.

మాకవరపాలెంలోని రెండు కేంద్రాల్లో పరీక్షలు పక్కాగా జరిగాయి. హైస్కూల్ కేంద్రంలో దివ్యాంగ విద్యార్థి దుర్గాప్రసాద్ పోలీసుల సాయంతో కేంద్రానికి వచ్చారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా 114 సెక్షన్ ఏర్పాటు చేసినట్టు ఎంఈవో మూర్తి తెలిపారు. రోలుగుంట జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 245 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా ఇద్దరు గైర్హాజరయ్యారని కేంద్రం చీఫ్ డి.రమేష్‌కుమార్ తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ రామకృష్ణారావు తనిఖీ చేసి ఎక్కడా అవాంచనీయ ఘటనలు జరగకుండా 144 సెక్షన్‌ను అమలు చేశారు. రావికమతం పరీక్షా కేంద్రాల్లో 819 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 807 మంది హాజరయ్యారు. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్టు ఎంఈవో తలుపులు తెలిపారు. బుచ్చెయ్యపేట మండలంలో వడ్డాది, దిబ్బిడిలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వడ్డాది కేంద్రంలో 278 మందికి ఐదుగురు హాజరుకాలేదు. దిబ్బిడిలో 137 మందికిగాను 133 మంది హాజరయ్యారు.



మాకవరపాలెం, దేవరాపల్లిలో దివ్యాంగులను తీసుకువస్తున్న పోలీసులు, తల్లిదండ్రులు

మాడుగులలోని ఐదు కేంద్రాల్లో 706 మంది రెగ్యులర్ పరీక్షలు రాయాల్సి ఉండగా, 703 మంది వచ్చారు. సుమారు 15 కిలోమీటర్లు దూరంలో ఉన్న బి.కింతాడ నుంచి పెంటకోటకు ఆటోలో వచ్చింది. కాశీపురం నుంచి సిమ్మ దుర్గమ్మ అనే దివ్యాంగ విద్యార్థిని తల్లిదండ్రులు పరీక్షా కేంద్రానికి మోసుకు వచ్చారు. కె.కోటపాడులోని 485 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, ఇందులో ఇద్దరు హాజరుకాలేదని ఎంఈవో కె.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని మూడు కేంద్రాల్లో సోమవారం జరిగిన పది పదో పరీక్షలకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ జరిగిన ఈ పరీక్షల్లో కోనాం నుంచి 135 మందికి 134 మంది హాజరుకాగా, చీడికాడ హైస్కూల్ నుంచి 170 మందికిగాను 169మంది వచ్చారు. మంచాల మోడల్ స్కూల్‌లో 186 మందికి శతశాతం హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ విధించామని ఎంఈవో బొంజుబాబు తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

నర్సీపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆర్డీవో వీవీ.రమణ ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్య పరిష్కార వ్యవస్థలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. గొలుగొండ మండలం కృష్ణదేవిపేటకు చెందిన పనగడుగుల వెంకటేశ్వరరావు పంచాయతీ రోడ్డును ఆక్రమించి కంచె ఏర్పాటు చేస్తున్నారని ఆర్డీవోకి ఫిర్యాదు చేశారు. రెవెన్యూ సమస్యలపై నాలుగు ఫిర్యాదులు వచ్చినట్టు కార్యాలయ సిబ్బంది చెప్పారు.

చెరకు రైతుల ధర్నాకు తరలిరండి

చోడవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ భవితవ్యంపై ఈ నెల 21న చెరకు రైతుల మహాధర్నాకు తరలిరావాలని రైతు సంఘం నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, నాగిరెడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఫ్యాక్టరీ క్రషింగ్ సక్రమంగా జరగక చెరకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నా, ఎవరికీ పట్టకపోవడం శోచనీయమన్నారు. ఫ్యాక్టరీని మూసివేయించేందుకు, ప్రైవేటుపరం చేయడానికి కుట్ర జరుగుతున్నదన్నారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీని కాపాడుకోవడానికి ప్రతీ చెరకు రైతు ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నేత శివ పాల్గొన్నారు.

డీఎస్సీపై హామీ నిలబెట్టుకోవాలి

చోడవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీపై ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని ఉత్తరాంధ్ర నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు పుల్లేటి గణేశ్ డిమాండ్ చేశారు. నిరుద్యోగుల ఆశలు నెరవేరేలా డీఎస్సీ నియామక ప్రక్రియ వెంటనే చేపట్టాలని కోరారు. న్యాయపరమైన చిక్కులు లేకుండా నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆలయాల భద్రతకు సీసీ కెమెరాలు

కె.కోటపాడు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆలయాల భద్రతకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని సీఐ పైడపు నాయుడు అన్నారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం సచివాలయ మహిళా పోలీసుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయాల్లో హుండీల దొంగతనాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. సమావేశంలో ఎ.కోడూరు, కె.కోటపాడు ఎస్ఐలు లక్ష్మీనారాయణ, ఆర్.ధనుంజయ్, జిల్లా క్లూస్ టీం హెచ్‌సీ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

మాడుగుల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు కోరారు. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలకు అనుకూలంగా పనిచేయాలని సూచించారు. ప్రతీ పథకం ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు యు.దేముడు, పి.అప్పలరాజు, వి.రంజిత్‌వర్మ, జి.శ్రీరామ్మూర్తి, పి.రమేశ్, కాశిబాబు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని రైతుల ధర్నా



ఆక్రమణలు తొలగించాలని నినాదాలు చేస్తున్న రైతులు

దేవరపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముషిడిపల్లి సమీపంలో దుబిరెడ్డి బందకు నీరు సరఫరా అయ్యే వాగులో ఆక్రమణలు వెంటనే తొలగించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అక్రమంగా కట్టిన దుకాణం ముందు సోమవారం ధర్నా చేశారు. సర్వే నంబరు 589, 580-2లపై దుబిరెడ్డి బందకు వాగు నీరు పారే రెండు కల్వర్టులను మూసివేసి షాపు నిర్మాణం చేపట్టారని, దాన్ని బ్రాందీ షాపునకు అద్దెకు ఇచ్చినట్టు బోర్డులు పెట్టారని రైతులు మండిపడ్డారు. ఈ సందర్భంగా వేపాడ మాజీ ఎంపీపీ వేచలపు చినరాము నాయుడు మాట్లాడుతూ 2008 నుంచి తగాదాలో ఉన్న ప్రభుత్వ భూమికి అధికారులు పాసుపుస్తకాలు ఇచ్చారని ఆరోపించారు. చినగుడిపాల, రాజచెరువులకు, కొత్త చెరువు, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వచ్చే వాగును పూర్తిగా మూసివేశారని చెప్పారు. దుబిరెడ్డి బంద చెరువుకు గెడ్డ, వాగు అదే వ్యవసాయం ఉత్పత్తులను తీసుకు వెళ్లడానికి రహదారి ఉండేదని, వీటన్నింటిని కనిపించకుండా కప్పేశారని తెలిపారు. ఆక్రమణదారులుకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు బోజంకి సూర్యనారాయణ, చిరికి వెంకటరమణ, బోజంకి అచ్యుతరామయ్య, వేచలపు సింహాద్రప్పడు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలని ఆందోళన



మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీలు

గొలుగొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): యాభై ఏళ్లుగా ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములను ఎన్ఆర్ఐ పేరు మీద ఆన్‌లైన్ చేసిన తహసీల్దార్ శ్రీనివాసరావును సస్పెండ్ చేయాలని ఏపీ ఆదివాసీ సంఘం గౌరవ సలహాదారు పీఎస్.అజయ్‌కుమార్, సాగుదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం అజయ్‌కుమార్ మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలంలోని గదబపాలెం గ్రామానికి చెందిన ఆదివాసీలు అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలంలో పాతమల్లంపేట రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబరు 850లో ఎలో 36 ఎకరాల భూమిని యాభై ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ భూమితో ఎటువంటి సంబంధం లేని వ్యక్తుల పేరుపై ఆన్‌లైన్ చేయడం తగదన్నారు. 2025 ఫిబ్రవరి 24వ తేదీన 2022 సర్వే రిపోర్టుల ఆధారంగా ప్రస్తుత తహసీల్దార్ శ్రీనివాసరావు ఎన్ఆర్ఐ దుగ్గిరాల బాలకృష్ణ పేరుమీద సర్వే నంబరు 850 /1లో 23.4 ఎకరాల భూమిని ఆన్‌లైన్ చేశారని ఆరోపించారు. నర్సీపట్నానికి చెందిన ఓ కాంట్రాక్టర్ పాతమల్లంపేట రెవెన్యూలో గల 36 ఎకరాల భూమిని కొనుగోలు చేశారని ఆయన తెలిపారు. ఆన్‌లైన్‌లో ఎన్ఆర్ఐ పేరును తొలగించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములను జిల్లా కలెక్టర్ పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసీ జిల్లా కన్వీనర్ మోసూరి రాజు, గదబపాలెం గ్రామానికి చెందిన సాగుదారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఎంతో మేలు



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

మాకవరపాలెం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఎంతో మేలు చేకూరుతుందని ఎంపీడీవో సీతామహాలక్ష్మి చెప్పారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే వారికి ప్రభుత్వం పలు రాయితీలు కల్పిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో చిరంజీవి, ప్రకృతి వ్యవసాయం కోఆర్డినేటర్ వెంకటలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ: వర్మీ ఎరువుతో సాగుచేసిన కూరగాయలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని ఎంపీడీవో మేరీరోజీ అన్నారు. వెలుగు కార్యాలయం వద్ద కూరగాయలు స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతీ సోమవారం వర్మీ ఎరువులతో సాగు చేసిన కూరగాయలను విక్రయిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కరుణానిధి, ఎస్ఐ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

నాతవరం: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యాన్ని కాపాడుతాయని రైతు సాధికార సంస్థ సిబ్బంది వైజీ భవానీ పేర్కొన్నారు ఎంపీడీవో కార్యాలయం వద్ద సేంద్రియ ఎరువులతో తయారు చేసిన వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బొప్పాయి, కూరగాయాలను స్థానికులకు విక్రయించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో పార్థసారథి, సిబ్బంది సింహాచలం, నారాయణమూర్తి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెరకు కార్శి సాగులో మెలకువలు

సరైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

- మొక్క తోటల్లో నేల మట్టానికి చెరకు నరకాలి
- వరుసల మధ్య లోతుగా దుక్కి
- చెరకు ప్రధాన శాస్త్రవేత్త ఆదిలక్ష్మి సూచనలు

అనకాపల్లి అగ్రికల్చర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో మొక్క తోటల్లో చెరకు దిగుబడి ఎకరాకు 35-40 టన్నులు కాగా కార్శి తోటల్లో దిగుబడి 20-22 టన్నులకు మించడం లేదు. అయితే సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే కార్శి తోటల్లో ఎక్కువ దిగుబడిని సాధించవచ్చని చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆదిలక్ష్మి చెబుతున్నారు. ఇందుకు సంబంధించి ఆమె వెల్లడించిన వివరాలు..



కార్శీ చెరకు తోట



డి.ఆదిలక్ష్మి, చెరకు ప్రధాన శాస్త్రవేత్త, ఆర్ఏఆర్ఎస్ అనకాపల్లి

చెరకు మొక్క తోటలతో పోల్చితే కార్శి విధానంలో దిగుబడులు ఒకింత తక్కువ అయినప్పటికీ రైతులు కార్శీ తోటల సాగుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందుకు కారణం సాగు ఖర్చు తక్కువగా ఉండడమే. చెరకు నరికిన తరువాత ఆ మొదళ్ల నుంచి వచ్చే పిలకల ద్వారా మరుసటి ఏడాది సాగు చేసే చెరకును కార్శి తోట అంటారు. కార్శి తోటల కోసం నేల తయారీ, విత్తనం నాటడం, ప్రథమ కృషి వంటి ఖర్చులు వుండవు మొక్క తోటల కన్నా ముందుగానే పక్వానికొస్తాయి. పంచదార శాతం ఎక్కువగా వుంటుంది. క్రషింగ్ సీజన్ ప్రారంభంలో షుగర్ ఫ్యాక్టరీల్లో పంచదార రికవరీ పెరగడానికి దోహదపడుతుంది. కార్శికి నీటి ఎద్దడిని తట్టుకొనే శక్తి అధికం.



కార్శీ కోసం చెరకు మొదళ్ల వరకు నరుకుతున్న రైతు

నేల మట్టానికి చెరకు నరకాలి

చెరకు మొక్క తోటను నరికేటప్పుడు గడలను నేల మట్టానికి నరకాలి. దీనివల్ల దుబ్బుల నుంచి ఒకేసారి మొలకలు వచ్చి అన్నీ ఒకేసారి పక్వానికి వస్తాయి. మొక్క తోటల్లో మోళ్లు రెండు, మూడు అంగుళాలు పైకి కనిపిస్తాయి. బోదెలపైన కనిపించే ఈ మోళ్లను పదునైన కత్తులతో బోదె అడుగున ఒకటి, రెండు అంగుళాల వరకు మట్టితో సహా తెగేటట్టు నరకాలి. దీనివల్ల మొక్కల వేళ్లు భూమిలో లోతుగా విస్తరిస్తాయి. నేల లోపల పొరలలోని తేమ, పోషకాలను గ్రహించి నీటి ఎద్దడిని తట్టుకుంటాయి.

అంతర కృషి

కార్శి తోటల్లో వరుసల మధ్య భూమిని గుల్ల చేయడానికి 15 సెంటీమీటర్ల లోతు వరకు దుక్కి చేయాలి. చెరకు మొదళ్ల పక్కనున్న మట్టిని వేళ్ల తెగేలా నరికి, వరుసల మధ్య దుక్కి చేయాలి. పాత వేళ్ల తెగిపోయి కొత్తవి రావడం వల్ల పైరు త్వరగా పెరుగుతుంది. కార్శి చేసిన 15-20 రోజులకు వరుసల మధ్య నాగలితో లేదా యంత్రంతో లోతు దుక్కుచేయాలి.

చెరకు చెత్త కప్పాలి

కార్శి చేసిన మూడు రోజులలోపు వరసల మధ్య చెరకు చెత్తను పరవాలి. దీనిపై ఎకరాకు రెండు కిలోల కుళ్లబెట్టిన సిలీంద్రాల పొడిని పేడ నీటితో కలిపి చల్లాలి. ఇంకా పది కిలోల సూపర్‌ఫాస్ఫేట్, ఎనిమిది కిలోల యూరియాను కలిపి చల్లితే తేమ నిలుస్తుంది. చెరకు చెత్త ఎరువుగా మారుతుంది. కలుపు మొక్కలు, పీక పురుగు తగ్గుతాయి. కార్శి చేసిన మూడు రోజులలోపు కలుపు నివారణ మందులు పిచికారీ చేయాలి. లేదంటూ 4వ వారం, 7వ వారం తర్వాత కలుపు తీయించి గొప్పులు తవ్వించాలి.

ఖాళీలు పూరించాలి

చెరకు దుబ్బులు చనిపోయి పొలంలో ఖాళీలు ఏర్పడితే నంచుల్లో పెంచిన నారును ఆయా ఖాళీ ప్రదేశాల్లో నాటాలి. లేదంటే ఖాళీలు ఉన్న దగ్గర పారతో తవ్వి, పాత వేళ్ల తీసి రెండు రోజులు ఆరనిచ్చి అదే రకం పిలకలను వేరొకచోట నుంచి తెచ్చి నాటాలి.

నీటి యాజమాన్యం

తేలిక నేలల్లో వారానికి ఒకసారి, మధ్యస్థ నేలల్లో పది రోజులకు ఒకసారి నీటి తడులు ఇవ్వాలి. పంట ఎదిగిన తర్వాత నీటి ఎద్దడి వుంటే 15-20 రోజులకు ఒకసారి తుడులివ్వాలి. నాలుగు నెలల వయస్సులో ఎదుగుదలను బట్టి జడచుట్లు వేయాలి.



కార్శీ తోటలో చెరకు మొక్కలు

క్రైం... crime news

బావిలో దూకి యువకుడి ఆత్మహత్య



దుర్గాప్రసాద్ (ఫైల్ ఫొటో)

మాకవరపాలెం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బావిలో దూకి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చామంతిపురం గ్రామంలో చోటుచేసుకుందని ఎస్ఐ.దామోదర్‌నాయుడు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని చామంతిపురం గ్రామానికి చెందిన దుంగల దుర్గాప్రసాద్(18) రావికమతం మండలానికి చెందిన ఓ యువతిని ప్రేమించి కొన్ని రోజుల క్రితం తన గ్రామానికి తీసుకువచ్చాడు. ఆ యువతికి ఇది వరకే వివాహం కావడంతో ఆమె బంధువులు రావికమతం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెండు రోజుల క్రితం దుర్గాప్రసాద్‌కు రావికమతం పోలీసులు ఫోన్ చేశారు. ఈ క్రమంలో దుర్గాప్రసాద్ ఆదివారం నుంచి కనిపించకుండాపోయాడు. కుటుంబ సభ్యులు అతని కోసం వెతకగా సోమవారం ఉదయం గ్రామంలోని నేలబావిలో అతని మృతదేహం కనిపించింది. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం తరలించారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఎలమంచిలి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి- రేగుపాలెం రైల్వే స్టేషన్‌ల మధ్య సోమవారం గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతిచెందాడు. సమాచారం అందుకున్న తుని రైల్వే ఇన్‌చార్జి ఎస్ఐ ఎన్.రవికుమార్, సిబ్బంది వచ్చి పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తికి సుమారు 50 ఏళ్ల వయసుంటుందని, తెలుపు నీలం, నలుపు గడుల షర్టు, నీలం రంగు ఫుల్ ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలి సిన వారు తుని రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆయన చెప్పారు.

గాయపడిన ఉక్కు కాంట్రాక్టు కార్మికుడి మృతి

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ వైర్‌రాడ్ మిల్-2 విభాగంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన కాంట్రాక్టు కార్మికుడు చికిత్స పొందుతూ సోమవారం ఆస్పత్రిలో మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అచ్యుతాపురం సమీప రామన్నపాలేనికి చెందిన టి.నర్సింగరావు (34) ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నారు. ఈ నెల 13న రాత్రి విధులకు హాజరైన ఆయన అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో స్టాపర్ చెకింగ్ చేస్తుండగా సుమారు ఏడు అడుగుల ఎత్తు పైనుంచి కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయన ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

పెళ్లిరోజు నాడే అనంతలోకాలకు..



కోటేశ్వరరావు(ఫైల్)

పాడేరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంపాడ పంచాయతీ గెడ్డంపుట్టు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన పెళ్లిరోజునాడే మృతి చెందడంతో గెడ్డంపుట్టు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గెడ్డంపుట్టు గ్రామానికి గుడిసా కోటేశ్వరరావు(42)కు మూడు రోజుల క్రితం తీవ్రమైన తలనొప్పి రావడంతో స్థానిక జిల్లా ఆస్పత్రిలో చేరారు. ఇక్కడ పరీక్షలు నిర్వహించిన వైద్యులు కోటేశ్వరరావుకు బ్రెయిన్‌కు సంబంధించిన సమస్య వచ్చిందని, కేజీహెచ్‌కు తరలించారు. అయితే మూడు రోజులుగా కేజీహెచ్‌లో బ్రెయిన్ స్ట్రోక్ సమస్యకు చికిత్సలు పొందుతున్న కోటేశ్వరరావు పరిస్థితి విషమించి సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. దీంతో మృతదేహాన్ని సోమవారం గ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. కోటేశ్వరరావుకు వివాహం జరిగి సోమవారానికి 25 ఏళ్లు పూర్తయిందని, వివాహం జరిగిన రోజునే ఆయన మృతి చెందడం బాధాకరమని గెడ్డంపుట్టు వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతునికి భార్య పెంటమ్మ, కుమార్తె శైలజ ఉన్నారు. ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరుతున్నది.

కిరండూల్ రైలు అరకులోయ వరకే

విశాఖపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని దార్లిపుట్, పాడువ స్టేషన్ల మధ్య ప్రీ నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో విశాఖ-కిరండూల్ మధ్య (58501, 58502 నంబర్లతో ఇరువైపులా) నడిచే పాసింజర్ రైళ్లు ఏప్రిల్ 2 నుంచి 10వ తేదీ మధ్య అరకులోయ వరకూ వెళతాయని వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. అరకు-కిరండూల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేశామన్నారు.

చెట్లకు క్యూఆర్ కోడ్

... 5వ పేజీ తరువాయి

పేరు- లెమన్, ఉపయోగాలు.. విటమిన్-సి అధికంగా ఉండి, ఇమ్యూనిటీ పెంచుతుందని తెలియజేస్తుంది.

త్వరలో అన్ని చెట్లకు క్యూఆర్ కోడ్

జీవశాస్త్రం చదువుతున్న విద్యార్థుల కోసం త్వరలో కళాశాలలో ఉన్న బొటానికల్ గార్డెన్‌లోని అన్ని చెట్లకు క్యూఆర్ కోడ్లు ఏర్పాటు చేస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. తొలి ప్రయత్నంగా అశోక వేప, కానుగ, పనస, మామిడి, నేరేడు, తదితర చెట్లకు క్యూఆర్ కోడ్ పెట్టినట్టు చెప్పారు.

గ్రామాలను దత్తత తీసుకోండి



హాజరైన అధికారులు



సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి

- మండల ప్రత్యేక అధికారులకు కలెక్టర్ పిలుపు

అనకాపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను గ్రామస్థాయిలో విజయవంతం చేసేందుకు మండల ప్రత్యేకాధికారులు తమ పరిధిలో ఒక గ్రామాన్ని దత్తత తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో మండలస్థాయి సమన్వయ కమిటీలు, అధికారులతో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమ అజెండాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రతి మూడో శనివారం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ జాహ్నవి, డీఆర్ఓ సత్యనారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ బీభత్సం

... 5వ పేజీ తరువాయి

వెళ్లకుండా అక్కడ ఇరువైపులా రైల్వే శాఖ సేఫ్టీ గడ్డర్లను ఏర్పాటుచేసింది. పరిమితికి మించి బండరాళ్లను రవాణా చేస్తున్న టిప్పర్ లారీ బాడీ...సేఫ్టీ గడ్డర్‌ను తాకింది. దీంతో గడ్డర్ విరిగిపోయి, రైల్వే ట్రాక్‌ను బలంగా తాకింది. డ్రైవర్ టిప్పర్‌ని ఆపకుండా వెళ్లిపోయాడు. సరిగ్గా అదే సమయానికి తమిళనాడు నుంచి విశాఖ వైపు వెళుతున్న గూడ్స్ రైలు వంతెన సమీపంలోకి వచ్చింది. టిప్పర్ లారీ, సేఫ్టీ గడ్డర్‌ను బలంగా ఢీకొనడంతో పెద్ద శబ్దం రావడం, రైల్వే ట్రాక్ పక్కకు జరగడాన్ని గమనించిన గూడ్స్ రైలు లోకోపైలట్ అత్యవసర బ్రేకులు వేశారు. మొదటి ఇంజన్ అప్పటికే వంతెన దాటింది. రెండో ఇంజన్ వంతెన మీదకు వచ్చినప్పుడు రైలు పూర్తిగా ఆగింది. ఈ విషయాన్ని లోకోపైలట్ వెంటనే రైల్వే అధికారులకు తెలియపరిచారు. అనకాపల్లి రైల్వే స్టేషన్ మేనేజర్ ఎస్.నివాస్, ఇంజనీరింగ్, మెకానికల్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భారీ క్రేన్‌తో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. సుమారు అడుగు మేర పక్కకు జరిగిన ట్రాక్‌ను సరిచేశారు. ఉదయం తొమ్మిదిన్నర గంటలకు పనులు పూర్తిచేసి తొలుత గూడ్స్ రైలును పంపారు. అనంతరం పాసింజర్ రైళ్లను నడిపారు. ఈ సంఘటన కారణంగా విజయవాడ నుంచి అనకాపల్లి మీదుగా విశాఖపట్నం వైపు వెళ్లే పలు రైళ్లను ఎలమంచిలి, బయ్యారం, నర్సింగబిల్లి, రేగుపాలెం, నర్సీపట్నం రోడ్ స్టేషన్‌లలో చాలాసేపు నిలిపివేశారు. రైల్వే ట్రాక్ (అప్‌లైన్)ను పునరుద్ధరించే వరకు డౌన్‌లైన్ మీదుగా కొన్నింటిని మళ్లించారు. దీంతో పలు రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడిచాయి. కాగా అనకాపల్లి-చోడవరం మార్గంలో విజయరామరాజు పేట మీదుగా రాకపోకలు సాగించే బస్సులు, ఇతర రవాణా వాహనాలను లక్ష్మీదేవి పేట గేటు మీదుగా మళ్లించారు.



మూడు గంటలు ఆలస్యంగా అనకాపల్లి చేరిన తిరుమల ఎక్స్‌ప్రెస్

టిప్పర్ డ్రైవర్ అరెస్టు, అధిక లోడుకు జరిమానా

అండర్‌బ్రిడ్జి వద్ద రైల్వే సేఫ్టీ గడ్డర్‌ను ఢీకొని రైల్వే ట్రాక్ దెబ్బతినడానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు ఆర్‌పీఎఫ్ ఎస్ఐ నవీన్ తెలిపారు. ప్రమాదం జరిగిన తరువాత డ్రైవర్ లారీని ఆపకుండా వెళ్లిపోయాడని, సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా టిప్పర్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని, డ్రైవర్ రమణబాబును అరెస్టు చేశామని ఆయన చెప్పారు.

కాగా పరిమితికి మించి బండరాళ్లను రవాణా చేస్తున్నందుకు టిప్పర్ లారీకి రవాణా శాఖ అధికారులు రూ.1,01,730 జరిమానా విధించారని ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తెలిపారు. అధిక లోడుతో మితిమీరిన వేగంతో వెళుతూ, రైల్వే సేఫ్టీ గడ్డర్‌ను ఢీకొనడాన్ని ఎస్పీ తుహిన్‌సిన్హా తీవ్రంగా పరిగణించారని, ఆయన ఆదేశాల మేరకు టిప్పర్ లారీని స్వాధీనం చేసుకుని, రవాణా శాఖ అధికారులకు అప్పగించినట్టు ఆయన చెప్పారు.

బస్సు బోల్తా

... 5వ పేజీ తరువాయి

దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో ఏం జరిగిందో తెలియక కార్మికులు బిగ్గరగా కేకలు వేశారు. అదే బస్సులో వున్న జి.రామకృష్ణ అనే యువకుడు వెనుక ఉన్న అద్దాన్ని పగలగొట్టి, బస్సులో నుంచి కార్మికులు బయటకు రావడానికి దోహదపడ్డాడు. అప్పటికే పలువురు కార్మికులకు తీవ్రగాయాలయ్యాయి. సీఐ రామకృష్ణ, ఎస్ఐ విభీషణరావు, 108 అంబులెన్సులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నక్కపల్లి సీహెచ్‌సీకి తరలించారు. వీరిలో తిమ్మాపురానికి చెందిన బస్సు డ్రైవర్ షేక్ సత్తార్‌తోపాటు కోటవురట్ల మండలం పందూరుకు చెందిన మానేపల్లి సత్యవతి, గొన్నాబత్తుల స్వాతి, చింతల సాయిలక్ష్మి, యర్రంశెట్టి మంగ, మారిశెట్టి భారతి, ఎస్.మహాలక్ష్మి, సరపాక సంతోషి, మారిశెట్టి హేమలత, ఎస్.వరలక్ష్మి, కైలాసపట్నం గ్రామానికి చెందిన చీకట్ల నూకరాజు, ఎస్.రాయవరం మండలం చినగుమ్ములూరుకు చెందిన కోసూరు తులసి, హనుమంతు లక్ష్మిలకు తీవ్ర గాయాలు కావడంతో ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లిలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న హోం మంత్రి వి.అనిత.. అధికారులు, టీడీపీ నాయకులు ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. అడిషనల్ ఎస్పీ దేవిప్రసాద్, నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు అనకాపల్లి ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. బస్సు బోల్తా పడిన ప్రమాదంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ విభీషణరావు చెప్పారు.

ఒడిదుడుకుల్లో గోవాడ

... 5వ పేజీ తరువాయి

తలెత్తడంతో క్రషింగ్ ఆగిపోయి రైతులు ఆందోళనకు దిగారు. తరువాత క్రషింగ్ పునరుద్ధరించినా.. 12న మరోసారి టర్బయిన్ లోపంతో క్రషింగ్ ఆగిపోయింది. సమస్యను సరిదిద్ది తిరిగి క్రషింగ్ ప్రారంభించినప్పటికీ 15న ప్లాంట్ నిర్వహణకు అవసరమైన విద్యుత్ ఉత్పత్తి కాకపోవడంతో క్రషింగ్ ఆగిపోయింది. మొత్తం మీద ఏడు వారాల్లో తొమ్మిదిసార్లు క్రషింగ్‌కు అంతరాయం ఏర్పడింది.

అరకొరగా ఓవర్‌హాలింగ్ పనులు

ఏటా సీజన్ ముందు ఫ్యాక్టరీలో ఓవర్‌హాలింగ్ పనులు చేసి యంత్రాలను క్రషింగ్‌కు సిద్ధం చేస్తారు. అయితే ఫ్యాక్టరీ ఆర్థిక ఇబ్బందుల్లో వుండడంతో యాజమాన్యం ఓవర్‌హాలింగ్ పనులను పరిమితంగానే చేసి క్రషింగ్‌నకు సిద్ధమైంది. దీనికితోడు నైపుణ్యం కలిగిన కార్మికుల కొరత కూడా గోవాడకు శాపంగా మారింది. ఫ్యాక్టరీలో రెగ్యులర్ కార్మికులు 71 మంది, ఎన్ఎంఆర్ కార్మికులు 91 మంది, సీజనల్ కార్మికులు 151 మంది, కాంట్రాక్టు కార్మికులు 330 మంది ఉన్నారు. సీజనల్ కార్మికుల్లో చాలామందికి జీతాలు వస్తాయన్న నమ్మకం లేకపోవడంతో వేరే పనులకు వెళుతున్నారు. దీంతో ఫ్యాక్టరీకి సగం మంది కార్మికులు కూడా రావడం లేదని, వచ్చిన వారు కూడా ఒకరోజు వస్తే, మరుసటి రోజు రావడం లేదని అంటున్నారు. దీంతో కార్మికులను వెతుక్కోవలసిన దుస్థితి నెలకొందని అంటున్నారు.

ఫ్యాక్టరీ మూసివేతకు కుట్ర

రెడ్డిపల్లి అప్పలరాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో చెరకు క్రషింగ్ తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి లేదు. ఫ్యాక్టరీని మూసివేయించే కుట్ర అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఫ్యాక్టరీ పరిస్థితిపై రైతులు ఆందోళన చేస్తున్నా, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం శోచనీయం. గోవాడ ఫ్యాక్టరీ పరిస్థితిపై చైర్‌పర్సన్ అయిన జిల్లా కలెక్టర్ స్పందించి రైతులకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.

భానుడి భగభగ!

... 5వ పేజీ తరువాయి

40, మాకవరపాలెంలో 40.4, మాడుగులలో 40.9, కోటవురట్లలో 40, గొలుగొండలో 40.3, బుచ్చెయ్యపేటలో 40.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగిలిన మండలాల్లో 35 డిగ్రీలకు పైబడి రికార్డయ్యాయి.

నర్సీపట్నంలో..

నర్సీపట్నం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పగటి ఉష్ణోగ్రతలు రోజు రోజుకి పెరుగుతున్నాయి. సోమవారం నర్సీపట్నం, చుట్టుపక్కల మండలాల్లో 40 డిగ్రీలకు అటుఇటుగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మార్చి మూడో వారంలోనే ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడం, వడగాడ్పులు వీస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	77.00
లైవ్ ధర	97.00
విత్ స్కిన్	164.00
స్కిన్ లెస్	174.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419